మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 53 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



## ఉత్తరాది రైతులు మోడీ మెడలు వంచారు

### అలాగే మన రైతులు కూడా బిజెపికి బుద్ది చెప్పాలి

**పసుపు బోర్డు పేరుతో అర్వింద్ అబద్దాలు ఆడారు**

**పదేపదే అబద్దాలు చెప్పడంలో మోడీ దిట్ట**

**రాముడి పేరుతో రాజకీయాలు సహించేది లేదు**

**ఆర్మూర్ కార్నర్ మీటింగ్‌లో సిఎం రేవంత్ రెడ్డి**



ఆర్మూర్,మే8(ఆర్ఎన్ఎ): పంజాబ్, హరియాణా రైతులు మోదీ మెడలు వంచి నల్లచట్టాలు రద్దు చేయించారని, నిజామాబాద్.. ఆర్మూర్ రైతులు అదేబాటలో నడవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో భాజపా, భారాసపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసినప్పుడు ఇచ్చిన హామీలను ఆ తర్వాత కవిత మరిచారని విమర్శించారు. పసుపుబోర్డు తెస్తానని చెప్పిన ధర్మపురి అర్వింద్ కూడా మోసం చేశారన్నారు. 2019లో రాజ్‌నాథ్‌సింగ్‌ను తీసుకొచ్చి పసుపుబోర్డుపై ప్రకటన చేయించిన అర్వింద్, ఇప్పుడు మోదీని తీసుకొచ్చి మళ్లీ అదే మాట చెప్పించారని ఎద్దేవా చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా మోదీ ఇలాగే హామీ ఇచ్చి కాలయాపన చేస్తారా అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే ఆర్మూర్‌ను అభివృద్ధిపథంలో ముందుం చుతానని హామీ ఇచ్చారు. చక్కెర కర్మాగారం తెరిపించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, రూ.42 కోట్ల బకాయిలు చెల్లించేందుకు నిధులు విడుదల చేశామని సీఎం తెలిపారు. ప్రధాని మోదీపై విమర్శలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి...చెప్పిన అబద్దాన్నే మోదీ మళ్లీ చెబుతున్నారని ఫైర్ అయ్యారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. దేవుడు గుడిలో ఉండాలి భక్తి గుండెల్లో ఉండాలని అన్నారు. బీజేపీ అభ్యర్థికి అహంకారం ఎక్కువని ఫైర్ అయ్యారు. రైతు కష్టమేమిటో జీవన్ రెడ్డికి తెలుసన్నారు. పోరాటపటిమ ఉన్నవాళ్లు ఆర్మూర్ రైతులని అన్నారు. 69 లక్షల మంది రైతులకు రైతుభరోసా మిగతా 2లో..

## దేశ సంపద అంతా సంపన్నుల పాలే..

### సంపద పెరిగినా అభివృద్ధి చెందని దేశం మన భారత దేశం

**దేశంలో కూడా పాలకులు మారాలి**

**టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కోదండరాం**



మెట్ పల్లి / జగిత్యాల మే 08 (ప్రజా మంటలు) : (చుక్క గంగారెడ్డి)

మన భారత దేశంలో సంపద అంతా కూడా నరేంద్ర మోడీ సంపన్నుల పాలు చేస్తూ... దేశం ఆర్థికంగా ఎదగకుండా చేస్తున్నారని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ ఆరోపించారు. టిజెఎస్ కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జ్ కంతి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి సభాధ్యక్షతన మెట్ పల్లిలోని మనోహర్ ఫంక్షన్ హాల్ లో బుధవారం కోరుట్ల నియోజక వర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం - పార్లమెంటు ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిది :గా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ పదేండ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడి దేశ సంపద అంతా కూడా మిగతా 2లో..

## భారీ వర్షంతో బాచుపల్లిలో విషాదం

### గోడకూలిన ఘటనలో ఏడుగురు మృతి - ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి



హైదరాబాద్, (ప్రజా మంటలు): హైదరాబాద్‌లో విషాదం చోటుచేసు కుంది. గోడకూలి ఏడుగురు కూలీలు మృతి చెందారు. మంగళవారం సాయం త్రం కురిసిన భారీ వర్షానికి బాచుపల్లి లోని రేణుక ఎల్లమ్మ కాలనీలో గోడ కూలింది. రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద ఏడు మృతదేహాలను గుర్తించి మిగతా 2లో..

## మరో రెండురోజులు అకాల వర్షాలు

### అప్రమత్తం చేసిన వాతావరణశాఖ



హైదరాబాద్, (ప్రజా మంటలు): తీవ్ర ఎండలకు అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇరు రాష్ట్రాల్లో దట్టమైన మబ్బులు, ఈదురు గాలులతో వాతావరణం చల్లబడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ జిల్లాలకు భారత వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మిగతా 2లో..



## అరచేతిలో వైకుంఠం చూపి మోసం చేసిన కాంగ్రెస్

**మహిళలకు బస్సు ప్రయాణం తప్ప ఒక్క హామీనెరవేరలే**

**రైతులను, యువకులను.. అందర్నీ వంచించిన పార్టీ**

**మోడీతో వీసమెత్తు ప్రయోజనం జరగలేదు**

**వెంకట్రామి రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి**

**నర్సాపూర్ కార్నర్ మీటింగ్‌లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్**

మెదక్, మే8 (ప్రజా మంటలు): అరచేతిలో వైకుంఠం చూపించి.. మనల్ని మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మిగతా 2లో..

## వచ్చే పదేళ్లు సిఎంగా రేవంత్ రెడ్డి

- బిఆర్ఎస్ ఛాప్టర్ క్లోజ్ అయినట్లే
- పార్లమెంటులో ఒక్కసీటు కూడా రాదు
- మోడీ మరోమారు గెలిస్తే.. ఇక నిరంకుశ పాలనే
- మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్,మే8 (ప్రజా మంటలు): వచ్చే పదేళ్లు తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డే ఉంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడమే గాకుండా, గత పాలకుల అవినీతిపైనా పోరాడుతుందని అన్నారు. ఎన్నికల తరవాత బిఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందనిఅ న్నారు. హైదరాబాద్ ప్రెస్÷-క్లబ్లో నిర్వహించాన మీట్ ది ప్రెస్‌లో కోమటిరెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. జూన్ 5 న 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ దుకాణం ఖాళీ అవుతుందన్నారు. బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేసిన ఆరుగురు ఎంపీ అభ్యర్థులు కాంగ్రెస్‌లోకి వస్తామని తనను సంప్రదించారన్నారు. డీ లిమిటేషన్ తర్వాత తెలంగాణలో 154 సీట్లు అవుతాయన్నారు. మిగతా 2లో..

### ఓవర్సీస్ ఛైర్మన్ శ్యామ్‌పిట్రోడా

## రాజీనామా


**వెంటనే ఆమోదించిన మల్లికార్జున ఖర్గే**

**వివాదాస్పద వ్యాఖ్యలతో చేటు తెచ్చిన పిట్రోడా**



న్యూఢిల్లీ,మే8 (ప్రజా మంటలు): ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ ఓవర్సీస్ ఛైర్మన్ శామ్ పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల కాలంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆయనే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల వారసత్వ పన్నుపై ఆయన చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. అవి మరువక ముందే తాజాగా జాతి వివక్ష వ్యాఖ్యలు చేయడంపై దుమారం రేగింది.భారత్‌లోని భిన్నత్వం గురించి పిట్రోడా మాట్లాడుతూ జాతి వివక్ష వ్యాఖ్యలకు పాల్పడ్డారు. 'తూర్పున ఉన్న ప్రజలు చైనీయుల్లా.. పశ్చిమవాసులు అరబ్బులుగా.. ఉత్తరాది వాళ్లు శ్వేత జాతీయులుగా.. మిగతా 7లో..

## ప్రజా నాడి




## అవినీతిలో కాంగ్రెస్, భారాసది ఫెవికాల్ బంధం : ప్రధాని మోదీ





- ఎన్నికల ప్రచారంలో వేగం పెంచిన మోడీ - తెలంగాణలో సుడిగాలి పర్యటనలు
- వేములవాడ, హన్మకొండ సభల్లో ప్రచారం - ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లలో కోతకు కాంగ్రెస్ కుట్ర
- మతపరంగా ముస్లింలకు కోటా ఇచ్చేలా వ్యూహం - రాజ్యాంగపరంగా దక్కిన రిజర్వేషన్లపై కాంగ్రెస్ కన్ను
- అయోధ్యలో రామాలయ తీర్పును సమీక్షిస్తే ఊరుకుందామా? - ఆదానీ,అంబానీలపై నోరు మడతేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై ఘాటు విమర్శలు - డబుల్ ఆర్ టాక్స్‌కు చరమగీతం పాడుదామని పిలుపు

వేములవాడ/హన్మకొండ, మే 8 (ప్రజా మంటలు): రాష్ట్రంలో మరో రెండుమూడు రోజుల్లో ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. ఈ క్రమంలో 400 సీట్ల టార్గెట్‌లో భాగంగా తెలంగాణలో అత్యధిక ఎంపి సీట్లు గెలవడమే లక్ష్యంగా బిజెపి ప్రచారం ఉధృతం చేసింది. ఇందులో భాగంగా ప్రధాని మోడీ తెలంగాణలో సుడిగాలి ప్రచారం చేపట్టారు. మంగళవారమే హైదరాబాద్ చేరుకున్న ప్రధాని మోడీ గురువారం ఉదయం వేములవాడ, హన్మకొండల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బిఆర్ఎస్‌లపై విమర్శల దాడి పెంచారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామని తమపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. అంతేగాకుండా కాంగ్రెస్ రిజర్వేషన్లపై కుట్రలు చేస్తోందని ప్రజలను హెచ్చరించారు. ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లలో కోత పెట్టి ముస్లింలకు ఇవ్వాలని చూస్తోందని, ఈ విషయంలో ఈ వర్గాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక చేశారు. ఇలాంటి రిజర్వేషన్లు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను లాక్కుని ముస్లింలకు ఇచ్చేందు కు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ తీరుతో ఓబీసీలకు నష్టం జరుగుతుందన్నారు. మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# అవినీతిలో కాంగ్రెస్, భారాసది ఫెవికాల్ బంధం : ప్రధాని మోదీ




మాదిగలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ అడ్డుపడుతోందన్నారు. మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు కట్టబడి ఉన్నామని అన్నారు. ఇకపోతే అయోధ్యలో భవ్యరామమందిరం నిర్మాణం చేపట్టామని, దీనిని కాంగ్రెస్ బహిష్కరించిందని అన్నారు. రామాలయానికి తెలంగాణ నుంచే ద్వారం అందిందని గుర్తించారు. అయితే అయోధ్య కేసును తిరగ దోడాలని కూడా చూస్తోందని అన్నారు. ఇది నకెంత అవమానమో గుర్తించాలని ప్రజలను మోడీ కోరారు. ఇది మీకు సమ్మతమేనా అని ప్రశ్నించారు. అలాగే ఇంతకాలం ఆదానీ, అంబానీల జపం చేసిన కాంగ్రెస్ ఎన్నికలు రాగానే వారిగురించి మాట్లాడడం లేదని, వారి నుంచి ఎంత ముట్టచెప్పుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపోతే రాష్ట్రంలో డబుల్ ఆర్ ట్యాక్స్ పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఇక్కడున్న ఒక ఆర్.. ట్యాక్స్ వసూలు చేసి, ఢిల్లీలో ఉన్న మరో ఆర్ కు కప్పం కడుతోందని ప్రధాని మోదీ అన్నారు. వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగిన సభలో మోదీ నిప్పులు చెరిగారు. బీజేపీ వేములవాడ సభలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌పై ప్రధాని మోదీ చెలరేగిపోయారు. తెలంగాణ గట్టు మీద తమ ప్రత్యర్థులిద్దరూ ఒక్కటేనని చాటడానికి ఉదాహరణలు, పంచ్‌లతో ప్రధాని మోదీ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. కలెక్షన్లలో ట్రిపుల్ ఆర్ సినిమాని డబుల్ ఆర్ ట్యాక్స్ మించిపోయిందని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ట్రిపుల్ ఆర్ సినిమా వెయ్యి కోట్లు సాధిస్తే.. డబుల్ ఆర్ మాత్రం కొన్ని రోజుల్లోనే ఆ విలువను దాటేసిందన్నారు. డబుల్ ఆర్ టాక్స్ నుంచి తెలంగాణను విముక్తి చేయాలన్నారు. అవినీతి సిండికేట్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ భాగస్వాములంటూ ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. ఇందుకు రెండు ఉదాహరణలు చెప్పారు.. కాంగ్రెస్‌పై ఓటుకు నోటు ఆరోపణలు చేసిన బీఆర్ఎస్– అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేక పోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం స్కామ్‌పై చర్యలు తీసుకోవట్లేదని ప్రధాని మోదీ ఆరోపించారు.అందుకే అవినీతిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ తోడుదొంగలని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో వ్యవసాయ, ఆర్థిక సంఘాలని అణచివేసిందని.. మోదీ అన్నారు. ప్రజల ఆశీర్వాదం తో ఐదవ పెద్ద అర్థిక వ్యవస్థగా భారత్ అవతరిం చిందని.. 360 అర్టికల్ రద్దు, రక్షణ అయుధాలు దిగుమతి స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయికి ఎదుగామని వివరించారు. మే 13న తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాపాలను కడిగి ఖతం చేయాలని..కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్ బీజేపి అభ్యర్థులను గెలిపించాలని మోదీ కోరారు. ఈ మేరకు అబ్యర్థులను వేదికపై ప్రజలకు పరిచయం చేశారు. వీరిని గెలిపిస్తే నేరుగా తనకు మద్దతు తెలిపనట్లని అన్నారు. అలాగే ఇంటింటికి వెళ్లి మోడీ వచ్చి వెళ్లారని, తన నమస్కారం తెలిపి ఓటు అడగాలన్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమికి పరాభవమేనని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మిగిలిన నాలుగు విడతల్లోనూ భాజపా, ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారని చెప్పారు. కరీంనగర్ లోక్‌సభ స్థానంలో భాజపా అభ్యర్థి బండి సంజయ్ విజయం ముందే నిర్ణయమైందన్నారు. ఇక్కడ ఎవరికీ తెలియని అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపిందని వ్యాఖ్యానించారు. సభ ప్రారంభానికి ముందు శ్రీరాజరాజేశ్వరస్వామిని మోదీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'దక్షిణ కాశీ భగవానుడు శ్రీరాజరాజేశ్వరస్వామికి ప్రణామాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కోసమే వచ్చాను. మీ ఓటు వల్లే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయి. పదేళ్ల ఎన్డీయే పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. వ్యవసాయాన్ని ఆధునికీకరించి లాభసాటిగా మార్చాం. ఆ రంగంలో డ్రోన్లను ప్రోత్సహించాం. టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేశాం. రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకుంటు న్నాం. కరీంనగర్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయమైంది. ఇక్కడ భారాస ప్రభావం మచ్చుకైనా కనిపించట్లేదు. కాంగ్రెస్, భారాసలకు కుటుంబమే తొలి ప్రాధాన్యత.. భాజపా మాత్రం దేశానికే తొలి ప్రాధాన్యం ఇస్తుంది. 'కుటుంబం వల్ల.. కుటుంబం చేత.. కుటుంబం కోసం..' ఈ నినాదంతో ఆ రెండు పార్టీలు పనిచేస్తున్నాయి. భారాస, కాంగ్రెస్ రెండూ ఒకటే.. నాణెలినికి బొమ్మాబొరుసులాంటివి. అవి అవినీతి పార్టీలు. తెలంగాణ ప్రజల స్వప్నాన్ని కాలరాశాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ప్రజల కలలు సాకారమవుతాయని అందరూ భావించారు. కానీ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెట్టి కుటుంబ లబ్ధి కోసమే భారాస పనిచేసింది. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ కూడా కుటుంబ ప్రయోజనాల కోసమే పనిచేసింది. వంశపారంపర్య రాజకీయాలతో దోపిడీ చేసింది. మాజీ ప్రధాని పీవీని కూడా ఆ పార్టీ అవమానించింది. ఆయన పార్థివ దేహాన్ని కాంగ్రెస్ కార్యాలయంలోకి అనుమతించలేదు. పీవీకి భారతరత్న ప్రకటించి భాజపా గౌరవించింది. దేశానికి ఆయన చేసిన సేవ ఎంతో ఉన్నతమైంది. పీవీ కుటుంబంలోని మూడు తరాల సభ్యులను కలిశాను. వారి నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నా. అవినీతిలో కాంగ్రెస్, భారాసది ఫెవికాల్ బంధం. ప్రజల ముందు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటారు. తెరవెనుక మాత్రం అవినీతి సిండికేట్‌గా మారుతారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టులో కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది.. అధికారంలోకి వచ్చాక ఆ అవినీతిపై దర్యాప్తు చేయట్లేదు. తెలంగాణ నుంచి దిల్లీ వరకు దేశవ్యాప్తంగా ఆర్ఆర్ ట్యాక్సుపైనే చర్చ జరుగుతోందని మోదీ అన్నారు. ఇక్కడి నుంచి నేరుగా హన్మకొండ సమీపంలోని మడికొండలో నిర్వహించాన సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ విజయం వైపు దూసుకెళ్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.ఎన్డీఏ కూటమికే ప్రజలు పట్టం కట్టబోతున్నారని అన్నారు. దేశం తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లొద్దన్నారు. కాకతీయ సామ్రాజ్య ప్రతీక వరంగల్.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి ఈ నగరాన్ని కాపాడాలన్నారు. వరంగల్ గడ్డపై బీజేపీ జెండా ఎగరబోతోందని చెప్పారు. నాలుగో దశ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే సీట్లు చూడాలంటే భూతద్దం సరిపోదని ప్రధాని మోదీ అన్నారు. ఇండియా కూటమితో ఏడాదికో ప్రధాని మారుతారని చెప్పారు. ఏడాదికో ప్రదాని ఉంటే.. దేశం బాగుపడుతుందా? అని ప్రశ్నించారు.ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. దేశం ఆగం అవుతుందన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ సమస్యలు ఉంటాయన్నారు. కుంభకోణాలు, అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్ అని విమర్శించారు. రుణమాఫీ చేస్తామని చెప్పి.. దాన్ని పంద్రాగస్టుకు తీసుకెళ్లారని.. దేవుడిపై ఒట్లు వేస్తున్నారని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. తెలంగాణ కోసం బలిదానాలు చేసిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ ఇచ్చిందా?, ప్రతి మహిళ ఖాతాలో రూ.2500 జమ చేసిందా అని ప్రశ్నించారు. అమరవీరుల కుటుంబాలకు ఇస్తామన్న 250 గజాల జాగ ఏమైందని ప్రధాని నిలదీశారు. రాష్ట్రంలో పవర్ కట్స్, నీళ్ల కరువుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందువల్ల ప్రజలు ఆలోచించి ఇక్కడి నుంచి నిలబడ్డ వరంగల్ అభ్యర్థి ఆరూరి రమేశ్, డాక్టర్ సీతారామ్ నాయక్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాగే వేముల వాడ సభలో బండి సంజయ్, గోడం నగేశ్, గోమాస శ్రీనివాస్‌లను ప్రజలకు చూపుతూ అత్యదిక మెజార్టీతో గెలిపించాలన్నారు. వీరిని తన ప్రతినిధులుగా గుర్తించాలన్నారు.

# వచ్చే పదేళ్లు సిఎంగా రేవంత్ రెడ్డి

154 సీట్లలో 125 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని కోమటిరెడ్డి తెలిపారు. కవితను చూస్తే చాలా నవ్వొస్తోందని అన్నారు. కవిత బతుకమ్మ చుట్టూ తిరుగుతుంది అనుకున్నామని.. కానీ బతుకమ్మలో బ్రాందీ బాటిల్ పెట్టుకొని తిరుగుతుందని మేం గుర్తించలేదని కోమటిరెడ్డి అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటే శంకరమ్మకి తెలివి ఎక్కువ ఉందన్నారు. తలసాని మంత్రి ఎలా అవుతాడని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని ఫుట్ బాల్ ఆడుకుంటానన్న తలసాని మంత్రి అయ్యి గొర్రెలు, బర్రెలు, చేపలు తిన్నాడన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో క్యాంప్ పెట్టినప్పుడు మూడు రాత్రులు తాను కనీసం రూం నుంచి కాలు బయట పెట్టలేదన్నారు. కొందరు డిల్లీ వెళ్లి పైరవీలు చేసుకున్నారన్నారు. కానీ తాను మాత్రం ఎక్కడికీ వెళ్ళలేదని అన్నారు. కవిత వల్ల మన పరువు పోయిందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలువదన్నారు. జూన్ 4 తర్వాత తెలంగాణ భవన్ క్లోజ్ అవుతుందన్నారు. . కేసీఆర్ సచ్చిన పాములాంటోడన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతో వచ్చేది లేదు.. సచ్చేది లేదని మంత్రి అన్నారు. ఈ ఎన్నికలు ఎంతో చాలా కీలకమన్నారు. రాముడి పేరు మీద బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. పదేండ్లు ప్రధానిగా ఉండి.. రాముడి పేరు చెప్పి ఓట్లు అడుక్కునే పరిస్థితి వచ్చిందని మోడీకి పట్టిందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లపై మోదీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ÷రైయ్యారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ నాయకులు మత కలహాలు రేపుతున్నారని మండిపడ్డారు. ఓట్ల కోసం బీజేపీ చిల్లర రాజకీయం చేస్తుందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల ముచ్చట ఏమైందని ప్రశ్నించారు. జీఎస్టీ పేరుతో భారీ మోసం జరుగుతుందని చెప్పారు. అంబానీ, అదానీ చేతుల్లోనే దేశ సంపద ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 నుంచి 15 సీట్లు గెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. మూడోసారి మోదీ ప్రధాని అయితే దేశంలో ఇక ఎన్నికలు ఉండవన్నారు. మన దేశంలోనూ రష్యా, చైనా తరహా పాలన వస్తుందని సంచలన ఆరోపణలు చేశారు. రాజ్యాంగాన్ని మార్చి వాళ్లే పాలకులుగా ఉంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 25 కోట్ల మంది ముస్లింల రిజర్వేషన్లు తీసేస్తామని ఎలా అంటారని బీజేపీకి కౌంటర్ వేశారు. వాళ్లంతా రోడ్ల మీదకు వస్తే ఏం జరుగుతుందో తెలుసా అని హెచ్చరించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని విమర్శించారు. ఈ రాష్ట్రంలో కేసీఆర్ శకం ముగిసిపోయిందని.. తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మొత్తం 17 స్థానాలకుగానూ 14 సీట్లు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీ లక్ష్యం 15 స్థానాల్లో విజయం సాధించడమని, అయితే 14 స్థానాల్లో గెలుస్తామన్న నమ్మకం తమకు ఉందని తెలిపారు. జూన్ 5 తరువాత దేశంలో చాలా మార్పులు వస్తాయన్నారు.

# అరచేతిలో వైకుంఠం చూపి మోసం చేసిన కాంగ్రెస్

ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని తెలిపారు. రైతులను, యువకులను.. అందర్నీ కాంగ్రెస్ పార్టీ వంచించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిందని.. ఒక్క ఉచిత బస్సు మినహా ఏది కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. గత 15 రోజులుగా దిగ్విజయంగా కొనసాగుతున్న కేసీఆర్ బస్సు యాత్ర బుధవారం నాడు మెదక్ పార్లమెంటు పరిధిలోని నర్సాపూర్ చేరుకుంది. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఐదు నెలల్లోనే రాష్ట్రం ఇంత ఆగమాగం ఎందుకయ్యిందని ప్రశ్నించారు. రైతుబంధు కూడా రేపు రేపు వ్యవసాయం చేసినోళ్లకే ఇస్తారంట.. పొలం దున్నినోళ్లకే ఇస్తారంట అని కేసీఆర్ అన్నారు. ఇంతకుముందు అట్ల వచ్చిందా? ఇంతకుముందు అందరికి వచ్చింది కదా? అని ప్రశ్నినంచారు. రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇయ్యాలి.. కానీ కోతలు అయినయ్.. కల్లాలు అయినయ్ ఇప్పుడు రైతుబంధు వేస్తామని అంటారు. ఇంతకంటే జోక్ ఏమైనా ఉంటదా? అని అడిగారు. తల, తోక లేకుండా ఈ ప్రభుత్వం అనేక రకాలుగా తెలంగాణను నష్టపరుస్తుందని మండిపడ్డారు. కరెంటు కోతల కారణంగా హైదరాబాద్‌లో పరిశ్రమలు వెళ్లిపోయే, ఐటీ దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీళ్ల కోసం కోమటిబండ నుంచి నర్సాపూర్‌కు ప్రత్యేక లైన్ వేయించినా.. కాళేశ్వరం ప్రాజెక్టుతో నర్సాపూర్ లింక్ కావాలని.. శంకరంపేట నుంచి కాల్వలు తవ్వుతున్నారు.. మల్లన్నసాగర్ నుంచి ఒక్కసారి నీళ్లు రావడం మొదలైతే.. నర్సాపూర్ బంగారు తునక అవుతుంది.. దాన్ని ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తదనే నమ్మకం లేదు. ఆ కాల్వ పూర్తి కావాలి.. మల్లన్న సాగర్ నుంచి బ్రహ్మాండంగా నీళ్లు రావాలంటే ఎంపీగా వెంకట్రామిరెడ్డి గెలవాలి.' కేసీఆర్ తెలిపారు. మనందరం కలిసి యుద్ధం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం నీళ్లు ఇచ్చేలా లేదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. ఇంకా నెరవేరుస్తదనే ఆశ లేదని అన్నారు. నర్సాపూర్‌ను కేసీఆర్ ఎన్ని రకాలుగా అభివృద్ధి చేసిండో మీ అందరికీ తెలుసని అన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీకి 25 కోట్లు ఇచ్చిన.. వాటిని కూడా వాపస్ తీసుకెళ్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి డబ్బులు ఇచ్చినం.. వాటిని కూడా వాపస్ తీసుకెళ్తున్నారని చెప్పారు. కొల్చారం మండలంలో మల్లినాథ సూరి పేరు మీద యూనివర్సిటీని పెడదామని అనుకున్నాం.. దాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేసేలా లేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు హల్దీవాగు మీద, మంజీరా నది మీద 10 చెక్‌డ్యామ్‌లు కట్టాం.. దాని ద్వారా పంటలు పండించుకున్నాం.. దాన్నంతా దెబ్బ తీసే పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు. అంటే సాగు నీరు రాదు.. తాగునీరు రావు.. కరెంటు రాదు.. సంక్షేమం లేదు. ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రతి దానికి ఏదో కొండి పెట్టడం, తొండి పెట్టడం, అబద్ధాలు చెప్పడం చేస్తుందని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలవాలని, మెదక్ ఎంపి అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎజెండాలో పేదల గోసలు, రైతుల బాధలుండవని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. నర్సాపూర్ రోడ్‌షోలో భాగంగా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నరేంద్ర మోదీ పార్టీతో ఏమన్నా పైసా లాభమైనా ఉన్నదా? సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఏమైనా అయ్యిందా? మోదీ పాలనో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.84కి పడిపోయింది. ఏ ప్రధానమంత్రి కాలంలో దిగజారనంత దిగజారిపోయింది. పెట్టుబడులు పోయాయి. పరిశ్రమలు మూతపడ్డాయి. కార్మికులు రోడ్డునపడుతున్నరు. ఎల్ఐసీని ముంచే ప్రయత్నం చేస్తున్నరు. పబ్లిక్ సెక్టార్ అంతా ప్రైవేటీకరణ చేస్తున్నరు' అంటూ మండిపడ్డారు. మోదీ ఎజండాలో పేదల బాధలు, గోసలుండయ్. రైతుల బాధలుండవు. ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తే.. 750 మంది రైతులను చంపిన వ్యక్తి నరేంద్ర మోదీ. మళ్లీ యూపీ ఎన్నికలు వస్తే సారీ చెప్పి.. మాఫీ చెప్పి వేడుకున్న వ్యక్తి మోదీ. ముఖ్యంగా యువకులు, విద్యా?ర్థులు, మేథావులు, ఆలోచనపరులతో నా మనవి. ఈ రాష్ట్రం, ఈ దేశం మనది. భవిష్యత్ మనది. దయచేసి ఆలోచించి ఓటు వేయండి. ఓ ఒరవడిలో కొట్టుకుపోయి ఓటు వేయడం కాదు. మనకు న్యాయం జరిగాలి. నర్సాపూర్‌లో లంబాడాలు ఎక్కువగా ఉన్నరు. నేను 58 సంవత్సరాలు మొత్తుకుంటే.. ఏ ముఖ్యమంత్రి లంబాడి తండాలను గ్రామ పంచాయతీలు చేయలేదు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిందే కేసీఆర్. మీకు డైరెక్ట్‌గా నిధులు పంపిందే కేసీఆర్. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు పెట్టిందే కేసీఆర్. ఇవన్నీ ఉన్నయ్. టీఎస్‌పీఎస్సీలో గ్రూప్–1 పరీక్షలు జరుగుతున్నయ్. పరీక్షల సమయంలో హైకోర్టు ప్రభుత్వాన్ని అడిగింది. పదిశాతం రిజర్వేషన్లు విరుద్ధంగా ఉందని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం చాలా బలంగా వాదించాలి కదా? కొట్లాడాలి కదా? అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం రిపోర్ట్ తెప్పించి.. కమిటీ వేసి చేసిందాన్ని నిలబెట్టాలి కదా? ఇవాళ మనం లేము. వాళ్లు మాట్లాడే పరిస్థితుల్లో లేరు' అన్నారు. మన పదిశాతం రిజర్వేషన్ మనది మనకే ఉండాలన్నా.. పార్లమెంట్‌కి వెంకట్రామిరెడ్డి వెళ్లాలి. మన తరఫున వాదించాలి. గిరిజనులకు పోడు భూములు ఇచ్చాం. పోడు భూములకు రైతుబంధు పడ్డదా? బీఆర్ఎస్ ఉన్నప్పుడు వచ్చింది.. బీమా కూడా చేశాం. ఇప్పుడు రైతుబంధు ఎవరికీ లేదు. సమాజంలో ఏ ఒక్క వర్గం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయడం లేదు. అందరం ఏకమై తెలంగాణను కాపాడుకోవాలి. కృష్ణా, గోదావరి నీళ్లను నరేంద్ర మోదీ తమిళనాడుకు తీసుకుపోతా అంటున్నడు. దాన్ని కాపాడాలన్నా.. తెలంగాణ ఆత్మగౌరవం కాపాడాలన్నా ఖచ్చితంగా బీఆర్ఎస్ ఎంపీలుంటేనే పార్లమెంట్‌లో పులిబిడ్డల్లా కొట్లాడుతరు. ఆ నాడు తెలంగాణ కోసం ఎలాగైతే కొట్లాడినమో.. అట్ల కొట్లాడుతరు. అలా హక్కులు ఉంటయ్. ఆల్రెడి నాకు రిపోర్ట్ ఉంది. వెంకట్రామిరెడ్డి తెలంగాణ మొత్తం మీదనే అతిఎక్కువ మెజారిటీతో గెలిస్తున్నడు మీ దీవెనలతోని. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కనీసం 40వేల–50వేల మెజారిటీని తీసుకురావాలని కోరుతున్నానన్నారు.



# దేశ సంపద అంతా సంపన్నుల పాలే..

అనీల్, అంబానీలకే దోచి పెడుతున్నారని ఆరోపించారు. ప్రతి వస్తువుపై జీఎస్టీ పేరుతో పేద ప్రజలను దోచి సంపన్నులు తీసుకున్న లక్షలాది కోట్ల అప్పులు మాఫీ చేశాడని పేర్కొన్నారు. దేశంలోని రైతులకు, రైతు కూలీలకు, కార్మికులకు, పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. దేశంలోని సంపన్నుల యొక్క

గత పదేండ్ల కింది ఆదాయం – నేటి ఆదాయం పోల్చి చూస్తే అనేక రెట్లు పెరిగి పోయిందన్నారు. అట్లానే దేశప్రజల ఆదాయం ఎందుకు పెరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోడీ దేశ ప్రజలను దోచి కార్పొరేట్ కంపెనీల బడా బాబులకు దేశ సంపద అంతా తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే దేశంలో కూడా తెలంగాణ రాష్ట్రం వలె పాలనలో మార్పు రావాలని అందుకే కాంగ్రెస్ పార్టీకి తమ తెలంగాణ జన సమితి పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ కాంగ్రెస్ ఎంపీల గెలుపు కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టీ. జీవన్ రెడ్డి కి ఈప్రాంత ప్రజలంతా మద్దతు నిచ్చి భారీ మెజారిటీ తో గెలిపించాలని ఆయన కోరారు. అందుకు తగిన విధంగా మద్దతు నివ్వాలని తెలంగాణ జన సమితి కోరుట్ల నియోజకవర్గ కార్యకర్తలకు నాయకులకు కోదండరాం తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు హాజరై నిజామాబాదు ఎంపీగా టి. జీవన్ రెడ్డి ని గెలిపించాలని కోరారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కన్నెగంటి రవి మాట్లాడుతూ రైతులకు ఈ ప్రభుత్వాలు చేసిన మోసం, రైతుల కష్ట – నష్టాల గురించి వివరించారు. తెలంగాణ జన సమితి కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.జీవన్ రెడ్డిని నియోజక వర్గ ప్రజలంతా ఆశీర్వదించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సమావేశానికి హాజరైన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. టిజెఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బొజ్జ కనకయ్య, మహిళా న్యాయవాది సురక్ష తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్,తెలంగాణ జన సమితి మెట్పల్లి పట్టణ అధ్యక్షులు పసునూరి శ్రీనివాస్, శనిగరపు అశోక్, రైతు నాయకులు రేపటి మల్లయ్య యాదవ్, టిజెఎస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు కంతి రమేష్ , జగిత్యాల జిల్లా విద్యార్థి జన సమితి అధ్యక్షులు జిల్లపెల్లి దిలీప్ కుమార్, మ్యాన సతీష్ తెలంగాణ జన సమితి యువజన విభాగం కోరుట్ల నియోజకవర్గ ప్రధానకార్యదర్శి, కోరుట్ల నియోజకవర్గ యువ జన సమితి అధ్యక్షులు వన్నెల శశి కుమార్, తెలంగాణ విద్యార్థి జన సమితి కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు రాంపెల్లి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షంతో బాచుపల్లిలో విషాదం

వెలికితీశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతులను తిరుపతిరావు (20), శంకర్ (22), రాజు (25), రామ్ యాదవ్ (34), గీత (32), హిమాన్షు (4), ఖుషిగా గుర్తించారు. బాచుపల్లిలో గోడకూలిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షంతో ఒక్కసారిగా గోడ కూలినట్లు అధికారులు ఆయనకు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నాలాలో రెండు మృతదేహాలు కొట్టుకురావడం కలకలం రేపింది. బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీ వద్ద ఈ మృతదేహాలను గుర్తించారు. బేగంపేట పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఉత్తరాది రైతులు మోడీ మెడలు వంచారు



ఇచ్చామని తెలిపారు. పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. హరీశ్ రాజీనామాను జేబులో పెట్టుకోవాలని సిద్ధిపేటకు ఆయన పీడను వదిలిస్తానని చెప్పారు. నల్లా చట్టాలపై మోదీ మెడలు వంచిన చరిత్ర రైతులదని అన్నారు. కోడ్ ముగిసిన వెంటనే చక్కెర రైతులను ఆదుకుంటా మని చెప్పారు. కేసీఆర్ సవాళ్ల పైన నిలబడే వ్యక్తేనా అని ప్రశ్నించారు. అమరవీరుల స్థుపం కాడ కేసీఆర్ ముక్కు నేలకు రాయాలని అన్నారు. ఆర్మూర్ కు మున్సిపల్ కార్యాలయానికి రూ, 16 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఒక్క అవకాశం జీవన్ రెడ్డికి ఇవ్వండని కోరారు. పసుపు బోర్డు రావాలంటే కాంగ్రెస్ గెలవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మరో రెండురోజులు అకాల వర్షాలు

భారీ వర్షాలు కురుస్తుండడంతో వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీచేసింది. వరుసగా రెండ్రోజులు వేర్వేరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఈదురుగాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పోలీసుశాఖ కూడా అప్రమత్తమైంది. పిడుగులు పడే ప్రమాదం ఉండడంతో ఎవరూ చెట్ల కిందకు వెళ్లవద్దని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను తాగవద్దని హెచ్చరించింది. అలాగే, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని, అత్యవసరమైతే 100కి డయల్ చేయాలని కోరింది. ఇకపోతే హైదరాబాద్‌లో భారీ వర్షం, ఈదురు గాలులతో నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చాలా చోట్ల ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు ఏర్పడడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసరంగా సమీక్ష నిర్వహించారు. వరంగల్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి నుంచే జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్.ఏ.ఎం రిజ్వి, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. భారీ వర్షాలు, ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన చేయూతను అందించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

## జగిత్యాలలో వైద్యుల ఆందోళన

### ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డాక్టర్ తాటిపాముల సురేష్ కుమార్

జగిత్యాల మే 08 (ప్రజామంటలు):



ఐఎంఏ జగిత్యాల, ఐడిఏ జగిత్యాల మరియు గవర్నమెంట్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గత ఆదివారము కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శ్రవణ్ మరియు హాస్పటల్ సిబ్బందిపై జరిగిన దాడికి నిరసనగా ఆందోళన చేపట్టడం జరిగింది. ఇట్టి ఆందోళనలో జగిత్యాల ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డాక్టర్ తాటిపాముల సురేష్ కుమార్ గారు మాట్లాడుతూ కోరుట్ల గవర్నమెంట్ హాస్పిటల్ లో డాక్టర్ మరియు హాస్పటల్ సిబ్బందిపై హత్యాయత్నం చేసిన వారిని మరియు హాస్పిటల్ ధ్వంసం చేసిన వారిపై వెంటనే అరెస్టు చేసి వారిపై చట్టబద్ధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే డాక్టర్స్ శ్రవణ్ ని వెంటనే విధులలోకి తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది, డాక్టర్లు ఎప్పుడు కూడా రోగుల బాగు కోసం పని చేస్తారని వారిపై ఈ విధంగా దాడి చేయడం, భయభ్రాంతులను గురి చేయడం వల్ల వారి మనోత్సర్యం దెబ్బతిని ముందు ముందు వైద్యం చేయాలంటే భయపడే స్థితి ఏర్పడుతుందని ప్రజలు కూడా గుర్తించి డాక్టర్లకు సహకరించాలని కోరారు. అలాగే ప్రభుత్వం కూడా డాక్టర్లపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో జగిత్యాల ఐఎంఏ కార్యదర్శి అజయ్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ ఐ డి ఏ జనరల్ సెక్రటరీ పాల్గొన్నారు.



మాజి కౌన్సిలర్ అనుమల్ల చంద్రం ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎం.పి. కాంగ్రెస్ అభ్యర్థి టీ. జీవన్ రెడ్డి కి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గడప గడపకు ప్రచారం నిర్వహించిన సిరపురం మహెంధర్, మానపురి మహెశ్, సంపత్, పెండెం మహెంధర్, ఆడెపు రాజేశ్, సిరపురం నిరంజన్ తదితరులు.

## అభివృద్ధి, ఉపాధికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ

### మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి

జగిత్యాల మే 08 (ప్రజామంటలు):



అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామం లో గా ఉపాధి హామీ కూలీలను కలిసి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలోని 25 వ వార్డులో ఇంటింటికి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కి ఓటు వెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.... జాతీయ ఉపాధి హామీ పథకం ను ప్రారంభించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు, వారికి ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం రూపొందించరన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో కోట్ల మంది కూలీలకు ఉపాధి దొరుకుతుందని గుర్తు చేశారు.దేశంలో యుపిఏ నాయకత్వం లో నడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమం పథకాలకు రూపకల్పన చేసీ, అమలు చేసిందన్నారు. గత పదేళ్లుగా ఉన్న రాష్ట్రంలో ఉన్న బీఆరెస్, కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీలు ప్రజలను మోసం చేశాయన్నారు. నిత్యావసర ధరల పెంపు, ఉపాధి పై నిర్లక్ష్యం, కార్పొరేటికరణ, నల్ల చట్టాలు, నోట్ల రద్దుతో నిరుపేదల పై మోయలేని భారం మోపిందన్నారు. చేసిన అభివృద్ధి చెప్పుకోలేని బిజెపీ పార్టీ, నేతలు మతం, దేవుళ్ళ పేరుతో ఓట్లు గుంజుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అవినీతి ఊబిలో కురుకుపోయిన బీఆరెస్ పార్టీకి బుద్ధి చెప్పిన మాదిరిగానే, దేశంలో ఉన్న బిజెపి అసమర్ధ పాలన పై కూడా ఓటు వేసి తీర్పు ఇవ్వాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ బరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా ఉన్న నిరంతర ప్రజా సేవకుడు జీవన్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ, జీవన్ రెడ్డి తోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో హస్నాబాద్ ఎంపిటీసీ మల్లారెడ్డి , రజిత , బత్తుల గంగాధర్, దుద గంగాధర్ లావణ్య, వార్డ్ 25 నుండి తోపారపు లావణ్య- రజనీకాంత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ "దమ్మన్నపేట గ్రామస్తుల ఆవేదన"

ధర్మపురి మే 08 (ప్రజామంటలు):



తమ గ్రామంలో కొన్ని సంవత్సరాల నుండి ఓవర్ లోడ్ సమస్యతో తరచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని , అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ దమ్మన్నపేట గ్రామానికి చెందిన యువకులు, రైతులు విద్యుత్ శాఖ కార్యాలయంలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాల సమీపాన గల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ గత కొన్ని సంవత్సరాల నుండి 15 వాట్స్ సామర్థ్యంతో పనిచేస్తుందని, ఓవర్ లోడ్ సమస్య తో ప్రతిరోజు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామానికి చెందిన లైన్మెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వీరి సమస్యను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంగనబట్ల దినేష్ వీరి వెంట విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి, గ్రామంలోని విద్యుత్ సమస్యని పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. 15 వాట్స్ ఉన్న ట్రాన్స్ఫార్మర్ సామర్థ్యాన్ని 25 వాట్స్ కు పెంచితే సమస్య పరిష్కారం అవుతుందని, తమ ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ రాకేష్ వారికి వివరించారు.

## కమలం గుర్తు గెలవాలని కాలినడకన కొండగట్టుకు చేరుకున్న చిర్ర రాజు



భీమదేవరపల్లి మే 08 (ప్రజామంటలు) : కమలం గుర్తు గెలవాలని కాలినడకన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు నుండి చిర్ర రాజు అనే యువకుడు మండుటెండల్లో సుమారు 80 కిలోమీటర్లు నడుచుకుంటూ బుధవారం కొండగట్టుకు చేరుకున్నాడు. బండి సంజయ్ గెలిపే లక్ష్యంగా భారీ మెజార్టీతో గెలవాలని కొండగట్టుకి ఎటువంటి ఆటంకం కలగకుండా చేరుకొని ఆంజనేయస్వామిని బండి సంజయ్ కుమార్ భారీ మెజారిటీతో గెలవాలని, కేంద్ర మంత్రి కావాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా చిర్ర రాజు మాట్లాడుతూ, దేశం సుభిక్షంగా ఉండాలంటే బిజెపి ప్రభుత్వం మళ్ళీ కేంద్రంలోకి అధికారంలోకి రావాలని, అందులో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ను గెలిపించి కేంద్ర మంత్రిగా చూడాలన్నదే నా చిరకాల ఆకాంక్ష అని, అందుకే ఈ పాదయాత్ర చేశారని అన్నారు.

## నన్ను గెలిపిస్తే పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకనవుతా..

**– కాంగ్రెస్, బిజెపి లకు ఓటు వేస్తే అభివృద్ధి జరగదు..**

**– బిఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి**

జమ్మికుంట మే 08 (ప్రజా మంటలు) :



కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకనువుతానని బిఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం జమ్మికుంట గాంధీ చౌక్ లో జరిగిన సభలో హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో కలిపి పాల్గొన్నారు ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది కేసీఆర్ అని తెలంగాణ అభివృద్ధి చెందింది కూడా కేసీఆర్ హయాంలోనే అని ఆయన అన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలు సొంతంగా ఏ నిర్ణయాలు తీసుకోలేరని అభివృద్ధి జరగాలంటే అది ఒక్క బిఆర్ఎస్ తోనే సాధ్యమని మళ్లీ తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని పార్లమెంటు ఎన్నికల్లో తనను కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా గెలిపిస్తే పార్లమెంట్లో ప్రశ్నించే గొంతుకన అని అన్నారు.కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యా చదువుకున్న గొప్ప వ్యక్తి వినోద్ కుమార్ అని అలాంటి వ్యక్తిని ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్ పార్లమ టంటు మరింత అభివృద్ధి చెందుతుందని గతంలో వినోద్ కుమార్ ఆధ్వర్యంలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని బిజెపి ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు చేసింది ఏమీ లేదు అని ఆయన అన్నారు. కాంగ్రెస్ కి ఓటు వేస్తే బురదలో వేసినట్టే అని అభివృద్ధి జరగాలంటే ప్రశ్నించే గొంతుక కావాలని అలాంటి సత్తా వినోద్ కుమార్ కు ఉన్నదని ఆయన అన్నారు. అనంతరం పట్టణంలో నడుస్తూ అందరిని పలకరిస్తూ ఉత్సాహంగా ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు,జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజకుమార్ టిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, కే డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్, పిఎసిఎస్ చైర్మన్ పోనగంటి సంపత్, కౌన్సిలర్లు గాజుల భాస్కర్, భోగం వెంకటేష్ వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## బాలిక మిస్సింగ్ కేసు నమోదు

జమ్మికుంట మే 08 (ప్రజా మంటలు) :



జమ్మికుంటలో 16 సంవత్సరాల బాలిక ఇంటినుండి బయటకు వెళ్లి మళ్ళీ తిరిగి రాలేదనే తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసేసినట్లు సి ఐ రవి తెలిపారు. రేవెల్లి సారయ్య, వెంకటేశ్వర్ల పల్లి మండలం గ్రామంలో ఉల్లిగడ్డ వ్యాపారం చేసుకొంటున్నాడాని, ఆయన కూతురు ఇంటర్మీడియట్ చదువుతున్నదని, 7 వ తేదీ రాత్రి సుమారు పది గంటలకు బహిర్ భూమికి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, చుట్టుపక్కల చూసిన వెతికిన దొరకలేదని, అందుకే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. తూర్పాటి శంకర్ (15) అనే మైనర్ బాలుడు అమ్మాయిని తీసుకొని పోయినట్లు అనుమానిస్తూ, దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసినట్టు జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు.

## ప్రభుత్వ విప్ అడ్లూరీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ధర్మారం నాయకులు



జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 08(ప్రజా మంటలు) : ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి,రామయ్యపల్లె గ్రామ శాఖ అధ్యక్షులు కోట మహేందర్ ఆధ్వర్యంలో బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన నలుగురు మాజీ వార్డు సభ్యులు గుండేటి రాజయ్య,బుతగడ్డ కుమార్,రేగుల అశోక్,కోట తిరుపతి, ముదిరాజ్ సంఘ ఉపాధ్యక్షులు రవి,గౌడ సంఘం మాజీ అధ్యక్షులు మారక బాలయ్య,పిట్టల రవి తదితరులు బుధవారం రోజున ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి ఎంపీటీసీ తాళ్లపెల్లి భద్రమ్మ -లింగయ్య గౌడ్ కొత్తూరు గ్రామ శాఖ అధ్యక్షులు కాంపెల్లి పోచయ్య ఆధ్వర్యంలో బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ మద్దుల నర్సయ్య, మాజీ వార్డు సభ్యులు నేరువట్ల కిరణ్ ,నేరువాట్ల దుర్గయ్య, తెరాస గ్రామశాఖ ఉపధ్యక్షులు నేరువాట్ల రవి, రాజయ్య ఒదయ్య, టీడీపీ యస్ టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్యా రాజేశం,శివ కుమార్ కాంగ్రెస్ లో చేరారు. అడ్లూరి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## పిడుగుపాటుతో ఎద్దు మృతి

భీమదేవరపల్లి మే 08 (ప్రజామంటలు) :




మండల కేంద్రంలో పిడుగు పడి ఎద్దు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భీమదేవరపల్లి గ్రామానికి చెందిన చేరాల వెంకటయ్య అనే రైతుకి చెందిన ఎద్దు పిడుగు పడి మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు 50 వేలు వుంటుందని అన్నారు. వ్యవసాయానికి వెన్నుముకగా ఉన్న ఎద్దు మృతి చెందడంతో రైతు వెంకటయ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి ఎద్దు మృతి చెందినదని అన్నారు. ఆ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

## ఓ హెల్పరన్న నీకు సలాం!

### క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలు ఫణంగా పెట్టి విద్యుత్ ఉద్యోగుల విద్యుక్తధర్మం

భీమదేవరపల్లి మే 08 (ప్రజామంటలు) :



ఓవైపు ఉదయం నుండే దంచి కొడుతున్న ఎండలతో ఉక్కపోత... సాయంత్రమైతే ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు బలంగా వీస్తుండడంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో సరఫరాలో అంతరాయం, కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పరిస్థితి, వర్షంతో పాటు ఈదురు గాలులు బలంగా వీయడంతో చెట్లు విరిగి కరెంటు తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వివరాల్లోకి వెళితే భీమదేవరపల్లి మండలం ములకనూరులో మంగళవారం పై సంఘటనలు చోటుచేసుకున్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి కరెంట్ స్తంభాలు ఎక్కి విద్యుత్ అంతరాయాన్ని లేకుండా చేయడం వారికే చెల్లింది. రాత్రిపూట విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడకుండా సరి చేశారు. మండల వ్యాప్తంగా ప్రజలు విద్యుత్ ఉద్యోగులకు సలాం కొట్టారు.





## ఈనెల 10న విశ్వబ్రాహ్మణుల భారీ బహిరంగ సభ

**ఎల్కతుర్తి మే 8 ప్రజా మంటలు**



హనుమకొండ జిల్లా విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వబ్రాహ్మణులు ప్రాణ త్యాగాలు చేసిన కూడా పది సంవత్సరాలు అధికారం కొనసాగించిన ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల గురించి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ఏమాత్రం విశ్వబ్రాహ్మణ గురించి పట్టించుకోలేదని తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి బుధవారం రోజున విలేకరుల సమావేశంలో తెలిపారు .ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు శృంగారపు వెంకటేశ్వర్లు వరంగల్ జిల్లా అధ్యక్షులు కురిమిళ్ళ రమేష ఉపాధ్యక్షులు సిద్దోజు రమేష్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు పంచకోటి సాంబ మూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఏర్రోజు బిక్షపతి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణులను అణగదొక్కే విధంగా వ్యవహరించింది కానీ అభివృద్ధి కోసం ఏమాత్రం పట్టించుకోలేదని అందుకే ఈనెల 13వ తారీకు నా జరిగే పార్లమెంటు ఎన్నికలలో అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి అధికార పార్టీ రాజకీయ ప్రతినిధులతో సమన్వయంగా ఉండి విశ్వబ్రాహ్మణుల సమస్యల సాధన కోసం కృషి చేసేందుకు అందులో భాగంగానే ఈనెల 10వ తేదీన శుక్రవారం రోజున వరంగల్లో విశ్వబ్రాహ్మణ సంఘం ఐక్య సంఘం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం చేయడం జరిగిందని ఈ సమావేశానికి హనుమకొండ వరంగల్ భూపాలపల్లి జిల్లా లోని అన్ని మండలాల నుంచి విశ్వబ్రాహ్మణుల సోదరులు విధిగా హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు ఈ సమావేశంలో అధికార పార్టీ మంత్రులు వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రాజకీయ ప్రముఖులు హాజరవుతారు.హనుమకొండ జిల్లా అధ్యక్షులు శృంగార వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికార పార్టీకి సమన్వయంగా ఉంటూ విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా వరంగల్ జిల్లా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు సిఎంగా రేవంత్ రెడ్డి

### అబద్దాల ప్రచారంతో విమర్శలు దారుణం - మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,మే8 (ప్రజా మంటలు) : సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రమాదవశాత్తూ రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అబద్దాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గాడిద గుడ్డు పెట్టదు కానీ రేవంత్ రెడ్డి పెట్టించారని విమర్శించారు. ప్రతి పబ్లిక్ మీటింగ్‌లో గాడిద గుడ్డుతో వస్తుంటే.. రేవంత్ రెడ్డి పార్టీ గాడిద గుడ్డు పార్టీయా? ఆయన గుర్తు గాడిద గుడ్డా? అని తెలంగాణ ప్రజలు అనుకుంటున్నారని సెటైర్ వేశారు. బీజేపీ రిజర్వేషన్లను తీసేస్తుందని జరుగుతున్న ప్రచారంపై కూడా కిషన్‌రెడ్డి స్పందించారు. రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లను ఎవరూ తొలగించలేరని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను తొలగించబోమని ప్రధాని మోదీ కూడా చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తుందని ధ్వజమెత్తారు. బీజేపీని.. కురే కురే బీజేపీ అని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్లపై కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ చిల్లర గాడు! అన్ని చిల్లర మాటలు మాట్లాడుతారని అని మాస్ సెటైర్లు విసిరారు. కేటీఆర్ పేరు కూడా ఉచ్చరించడం కూడా తనకు ఇష్టం ఉండదని.. అందుకే ఎప్పుడూ ఆయన పేరు ప్రస్తావించనని అన్నారు. కేటీఆర్ కామెంట్లపై తాను స్పందించనని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ఖండిస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ లబ్దిదారులే బీజేపీపై విశ్వాసంతో మద్దతు పలుకుతున్నారని చెప్పారు.కాంగ్రెస్ 'రిజర్వేషన్' ప్రచారం ఫెయిల్ అయిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది బాధ్యతారాహిత్యమైన విమర్శ అని కొట్టిపారేశారు.

## బాచుపల్లి ప్రమాదంలో చనిపోయిన ఏడుగురికి పోస్టుమార్టం

**స్వస్థలాలకు డెడ్ బాడీలను పంపించిన పోలీసులు**

**గాంధీ ఆసుపత్రి వద్ద పోలీసుల బందోబస్తు**

సికింద్రాబాద్ మే 08 (ప్రజామంటలు):

బాచుపల్లి లో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ప్రహారీ గోడ కూలీ మరణించిన ఏడుగురి మృత దేహాలకు గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. బుధవారం ఉదయం బాచుపల్లి నుంచి గాంధీ కి తీసుకొచ్చిన డెడ్ బాడీలకు సాయంత్రం వరకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించినట్లు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు, ఫోరెన్సిక్ డిపార్ట్ మెంట్



హెచ్ఓడీ ప్రొ. కృపాల్ సింగ్ తెలిపారు. చత్తీస్గఢ్ కు చెందిన ఇద్దరు కార్మికుల డెడ్ బాడీలకు సిటీలోనే అంత్యక్రియలు నిర్వహించడానికి వారి బంధువులు నిర్ణయించగా, మహారాష్ట్ర కు చెందిన మూడు, ఒడిషా కు చెందిన రెండు మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్ లో పోలీసులు వారి స్వస్థలాలకు తరలించారు. కాగా గాంధీ ఆసుపత్రి మార్చురీ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తమ వారు చనిపోయిన విషయం తెలుసుకున్న కార్మికుల బంధువులు గాంధీకి చేరుకోగా, వారినుంచి మృతుల వివరాలను పోలీసులు అడిగి తెలుసుకొని, పంచనామా నిర్వహించారు. అకాల వర్షాలకు గోడ కూలిన ఘటనలో తమ వారు చనిపోవడం పట్ల వారి బంధువులు విలపించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని మృతుల కుటుంబ సభ్యులు కోరారు.

# 11న ముగియనున్న ఎన్నికల ప్రచారం

**సాయంతరం నుంచి మద్యం షాపుల మూసివేత**

హైదరాబాద్,మే8(ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. మద్యం దుకాణాలను రెండు రోజుల పాటు మూసివేయాలని సూచించింది. మే 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం వరకు వైన్ షాపులు మూతబడనున్నాయి. ఈ రెండు రోజులను డ్రై డేగా ప్రకటించారు. తిరిగి మంగళవారం ఉదయం మద్యం షాపులు తెరుకునేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. మరోవైపు ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4న కూడా మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఇకపోతే ఎన్నికల ప్రచారం 11న సాయంత్రి ముగియనుంది. ఈ క్రమంలో మద్యం దుకాణాలు కూడా మూతపడనున్నాయి. దీంతో మద్యం ప్రియులు ముందుగానే అలర్ట్ అవుతున్నారు. మరోవైపు వేసవికాలంలో బీర్ల కొరత ఏర్పడింది. చాలినన్ని బీర్లు దొరక్క మద్యం ప్రియులు అసంతృప్తి చెందుతున్నారు. ఎండలు పెరగడం, ఐపీఎల్, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో బీర్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగిన సప్లై లేకపోవడంతో చాలా చోట్ల వైన్ షాపులలో నో స్టాక్? బోర్డులు పెడుతున్నారు. ప్రభుత్వమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మద్యంప్రియులు కోరుతున్నారు. అయితే ఇదే అదనుగా చేసుకుని కొందరు కొన్ని చోట్ల అధిక ధరలకు అమ్ముతున్నారని వాపోతున్నారు.

## కాంగ్రెస్‌కు ఉగ్రవాద సంస్థల మద్దతు

**అధికారంలోకి వస్తే దేశం ఉగ్రవాద చేతుల్లోకి**

**ఎంపి ధర్మపురి అర్వింద్ హెచ్చరిక**

నిజామాబాద్, మే8(ప్రజా మంటలు): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశం ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్తోందని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టెర్రరిస్ట్ సంస్థలన్నీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించాయని తెలిపారు. ముస్లింలంతా కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని సిమి ( స్టూడెంట్ ఇస్లామిక్ మూమెంట్ ఆఫ్ ఇండియా ) ప్రకటించిందని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ధర్మపురి అర్వింద్ మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికలు బీజేపీకి, టెర్రరిస్టులకు మధ్య జరుగుతున్నాయనే సందేహాలు కలుగుతున్నాయని ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. నిషేధిత సంస్థ సిమిపై 15 టెర్రరిస్ట్ కేసులు కూడా ఉన్నాయని వెల్లడించారు. పీఎఫ్ఐ, సిమికి కాంగ్రెస్ మాతృసంస్థగా మారిందని విమర్శించారు. ఆ రెండు సంస్థలు కూడా కాంగ్రెస్‌కు ఫండింగ్ చేస్తున్నాయని ఆరోపించారు.




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ ప్రస్తుయిజ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి. mantalukathalu@gmail.com

## మాతృభాష మధుర భాష

“అమ్మ పదవ తరగతి పరీక్ష ఫలితాలు వచ్చాయి. నేను అన్ని సబ్జెక్టులు పాసయ్యాను “అని అశోక్ చెప్పగానే కంగ్రాట్స్ అంటూ అమ్మ అశోక్ నోటిని పంచదారతో తీపి చేసింది. ఇంట్లో ఉన్న నాన్న అక్క తాతయ్య నాయనమ్మలు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. కానీ అశోక్ మొహంలో ఎంత మాత్రం సంతోషం లేదు .ఇది గమనించిన అశోక్ వాళ్ళ నాన్న ఎందుకు దిగాలుగా ఉన్నావు. ఎందుకు సంతోషం గా లేవని ప్రశ్నిస్తే బోరున విలపించాడు .

నాన్న ఏడుస్తున్న అశోక్ ను ప్రేమగా తన చేతులతో దగ్గరకు తీసుకొని తల నిమురుతూ అడిగాడు . “ఎందుకు ఏడుస్తున్నావు అందుకు గల కారణం ఏమిటని అడిగితే” బిక్క మొహం వేసుకొని నాన్న” నేను పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మాతృభాష తెలుగు తప్ప, మిగిలిన అన్ని సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించాను. అందులో ఎక్కువ మార్కులు వస్తే టాపర్ గా నిలిచేవాడిని. మీరు ఎన్నిసార్లు చెప్పినా కూడా నేను మాతృభాష తెలుగును చిన్నచూపు చూశాను. సరిగ్గా చదవలేదు. అంతా నాకే వస్తుందని అతి చేశాను . ఫలితంగా తగిన శాస్తి జరిగిందంటు” విలపించాడు.



అశోక్ ను వాళ్ల నాన్న ఊరడిస్తూ” ఏం పర్వాలేదు. జరిగిందేదో జరిగిపోయింది. ఇకమీదట అన్ని భాషలను సమానంగా చదవాలి. నిర్లక్ష్యం చేయకూడదు. మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే మనల్ని మనం అవమానపరుచుకున్నట్లే.” మన మాతృభాష మాధుర్యం యే భాషకు కూడా లేదు .అందుకే “దేశభాషలందు తెలుగు లెస్స” అంటూ , “ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ ఈస్ట్ “అని తెలుగు భాష మాధుర్యాన్ని గొప్పవాళ్లు ప్రపంచానికి చాటి చెప్పారు .అందుకే ఇతర భాషలను నేర్చుకోవాలి కానీ, అందుకు ప్రాతిపదికగా ఉన్న మాతృభాషను చిన్నచూపు చూడొద్దు. అని చెప్పగానే అశోక్ “నన్ను క్షమించండి” ఇకమీదట ఇలాంటి నిర్లక్ష్యం చేయనున్నాడు.

నీతి: మాతృభాషను మరవకుబినిర్లక్ష్యం చేయకు

- యాడవరం చంద్రకాంత్ గౌడ్

సిద్దిపేట, 9441762105

# ప్రజలకు ఉపశమనం..రైతులకు శాపం !

తీక్షణమైన ఎండలతో అల్లాడిపోయిన జనాలకు ఉపశమనం కలిగింది. భానుడి ఉగ్రరూపంతో దస్సిన ప్రాణాలకు సత్తువ వచ్చింది. పోయినా ప్రాణాలు వచ్చాయన్న సంతోషం కలిగింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆరుగాలం కష్టడే రైతన్నలు మాత్రం కుప్పకూలిపోయారు. అక్కడక్కడా పంటలు కోసి అమ్మకానికి సిద్దంగా పెట్టుకున్న పంటలన్నీ వర్షార్ణం అయ్యాయి. వీరికి ఎండలను మించిన బాధ ఇప్పుడు చుట్టుకుంది. అకాల వర్షాలు ఉంటాయని గత వారం రోజుల ముందే హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ఒకరోజు ముందు కూడా హెచ్చరిం చింది. అయినా ధాన్యం కాపాడడంలో చర్చు తీసు కోవడంలో అధికారులు విఫలం అయ్యారు. ప్రధానంగా మార్కెట్ యార్డులకు తీసుకుని వచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, రైతులకు డబ్బులు చెల్లంచడంలో అధికారులు విఫలమయ్యారు. ఇది మార్కెటింగ్ అధికారుల వైఫల్యంగా చూడాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇది కనిపించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం పిడుగుల వాన కురిసింది. భారీ వర్షానికి, ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అరటి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పిడుగుపాట్లకు ఐదుగురు, వేర్వేరు ఘటనల్లో మరో ఇద్దరు మొత్తం ఏడుగురు మృత్యువాత పడ్డారు. ఈ క్రమంలో రైతులు చెమటోడ్చి తెచ్చిన ధాన్య వర్షార్పణం అయ్యింది. ఇలాంటి వారిని గుర్తించి వెంటనే సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇకపోతే పంట కోతకు వచ్చిన దశలో కొట్టుకు పోయిన వారి బాధ మరోటి. కొద్ది రోజుల్లో పంటను కోద్దామని అనుకున్న సమయంలో అకాల వర్షం బాగా దెబ్బతీసింది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో అన్నదాతకు అపారనష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, నింపిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. పండ్లు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. ఈదురుగాలులకు పలుచోట్ల ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. విద్యుత్తు స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి. పలుచోట్ల పిడుగులు పడటంతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఎపిలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. రహదారు లపై భారీ వృక్షాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సిద్దిపేట జిల్లా రాయపోల్, మిరుదొడ్డి, కుకునూరుపల్లి, కొండపాక, గజ్వేల్ మండలాల్లో మంగళవారం కురిసిన వానకు ధాన్యం తడిసింది. సిద్దిపేట మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో బలమైన ఈదురుగాలులకు విద్యుత్తు స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. పిట్టలగూడెంలో గాలివానకు రేకుల ఇండ్లు ధ్వంసమయ్యాయి. చేర్యాల మండలంలోని వీరన్నపేటలో రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలో మామిడి కాయలు రాలి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పర్ణశాలలో ఈదురు గాలులకు పలు షాపులు, ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయి పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల చెట్లు కూలగా, విద్యుత్తు స్తంభాలు విరిగాయి. గణపురం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు, ఏటూరునాగారం, మంగపేట, గోవిందరావు పేట, వెంకటాపూర్, వెంకటాపురం మండలాల్లో ధాన్యం రాశులు తడిశాయి. ఖానాపురం, ఆత్మకూరు, చెన్నారావ ుపేట, వర్ధన్నపేట మండలాల్లో ఈదురుగాలులకు పలువురి ఇంటిపై కప్పులు ఎగిరిపడ్డాయి. జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో మామిడి కాయలు రాలడం, కూరగాయలు, పండ్ల తోటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. చొప్పదండి, గంగాధరలోని మార్కెట్ లోనూ ధాన్యం తడిసింది. సీతారాంపూర్‌లో విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. లంబాడి పల్లె గాగిరెడ్డిపల్లి రహదారి మధ్య చెట్టు విరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసిపోగా, పలువురి ధాన్యం నీటిలో కొట్టుకపోయింది. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ధర్మారం, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిస ి ముద్దయింది. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం తడిసి ముద్దయింది. మక్కపంట నేలవాలింది. గాలికి మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. బొప్పాయి చెట్లు నెలకొరిగాయి. రంగారెడ్డి జిల్లా జోగిపేట వ్యవసాయ మార్కెట్‌తోపాటు చింతకుంట కొనుగోలు కేంద్రాలు, రంసాన్‌పల్లి, దానంపల్లి, మాసన్‌పల్లి, ఎర్రారం శివారుల్లో రైతులు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిసోయింది. హత్నూర, మాధుర గ్రామాల్లో ధాన్యం బస్తాలు తడిశాయి. పెద్దమందడి మండలం అల్వాల గ్రామ శివారులో పిడుగుపాటుకు 48 గొర్రెలు మృతి చెందాయి. ఈ నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది. ఎన్నికల పర్యటనల్లో బిజీగా ఉన్నప్పటకి ముఖ్యమంత్రులు వెంటనే సర్వే నిర్వహించాల్సి ఉంది. నష్టోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాలి. అప్పుడే వారిలో భరోసా వస్తుంది. ఇకముందు వర్షాల హెచ్చరికలు రాగానే క్షేత్రస్థాయిలో రైతులను అప్రమత్తం చేసి పంటలను కాపాడాలి. అలాంటి వ్యవస్థను బలోపేతం చేయాలి.అప్పుడు పంటనష్టాన్ని తగ్గించుకోగలం అని గుర్తించాలి.

# అల్లూరి స్ఫూర్తితో గిరిజనులకు అండ

## చట్టాలు ఎన్ని ఉన్నా దక్కని భరోసా

## న్యాయం కోసం నిరంతరం పోరాటం

శ్రీకాకుళం,మే8 (ప్రజామంటలు): తెలుగుజాతి స్ఫూర్తి ప్రదాత, ఆదివాసీల ఆరాధ్య నేత అల్లూరి సీతారామరాజు అమరుడై వందేళ్లు పూర్తి చేసుకుని వందా ఒకటో సంవత్సరంలో అడుగుపెట్టబోతోంది. 1924 మే7న అల్లూరి సీతారామరాజును చెట్టుకు కట్టి కాల్చి చంపారు. ఆనాటికీ నేటికీ గిరిజనుల జీవితాల్లో ఎలాంటిమార్పు చోటుచేసుకోలేదు. ఆనాటి దోపిడీ వ్యవహారం ఇంకాకొనసాగుతోంది. ఆదివాసుల హక్కులను స్వతంత్ర భారతంలోనూ కాలరాస్తున్నారు. భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు కొన్ని రక్షణలు, హక్కులు కల్పిస్తూ 5,6 షెడ్యూళ్లలో పొందుపర్చారు. షెడ్యూల్ ప్రాంతంలో ఎన్ని చట్టాలు వచ్చినా అవేవీ అమలు కావడం లేదు. 1/70చట్టం ఉన్నప్పటికీ ఉత్తరాంధ్ర-గోదావరి మన్యంలో వేలాది ఎకరాలు అన్యాక్రాం తమైపోయాయి. వీటిని గిరిజనేతర భూస్వాములు నేటికీ చట్టవిరుద్ధంగా అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ పాలన లో కేంద్రప్రభుత్వం అటవీ రక్షణ చట్టం తీసుకు వచ్చింది. ఈ చట్టం ఆదివాసీలకు అటవీ హక్కులు కల్పించినప్పటికీ, వారి సాగు భూమికి,పోడు భూమికి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తూ వచ్చాయి. పోడు భూముల హక్కుల కోసం పోరాడుతున్న ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళకు పంపిస్తున్నారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేదు. షెడ్యూల్ ప్రాంతంలో చట్టాలు ఉన్నప్పటికీ మైదాన ప్రాంత కాంట్రాక్టర్లు, పాలకపక్ష నేతలు యథేచ్ఛగా గనులు తవ్వి వందల కోట్లు ఆర్జిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రధానంగా ఆదివాసీ కుటుంబాలే భూమిని, ఊరును, ఉపాధిని కోల్పోయారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా వారికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వడంలేదు. షెడ్యూల్ ప్రాంతంలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు లేవు. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల ఉద్యోగాలకు జీవో నెం:3 రక్షణగా ఉండేది. దానిని సుప్రీం కోర్టు కొట్టివేసింది. అనేక ఆదివాసీ వ్యతిరేక చర్యలు చేపట్టి ఆదివాసీల అస్థిత్వానికే ప్రమాదం తెచ్చిపెడుతోంది. ఆదివాసీ చట్టాలను సవరించి, రద్దుపర్చి తీవ్ర అన్యాయం చేస్తోంది. తెగల మధ్య అనైక్యతను పెంచే కుట్రలను చేస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడంలేదు. షెడ్యూల్ ప్రాంత చట్టాలను అమలు చేయడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో పంచాయతీలకు పీసా చట్టం ఉన్నప్పటికీ అమలు చేయడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతర భూస్వాముల, వ్యాపారుల, కాంట్రాక్టర్ల కొమ్ముకాస్తున్నాయి.ఆదివాసీ లకు అన్యాయం చేస్తు న్నాయి. నాడు బ్రిటిష్ ప్రభుత్వం ఆదివాసీలతో రోడ్లు, ఘాట్ రోడ్లు వేయించేది. కూలీ చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించేవారు. బ్రిటిష్ అటవీ విధానాన్ని కఠినంగా అమలు జరిపి ఆదివాసీ ల సాంప్రదాయక పోడు వ్యవసాయాన్ని నిషేధించారు. అటవీ ఉత్పత్తులను సేకరించడంపై ఆంక్షలు విధించారు. బ్రిటిష్ రెవెన్యూ చట్టాలు ఆదివాసీల స్వంత భూములు కోల్పోయే పరిస్థితి తీసుకు వచ్చింది. విశాఖ-గోదావరి మన్యంలో తమ జీవనానికి ఏకైక ఆధారమైన భూములను ఆదివాసీలు పెద్ద ఎత్తున కోల్పోయారు. దీనికి తోడు మైదాన ప్రాంతం నుండి వచ్చిన వ్యాపారులు, అటవీ కాంట్రాక్టర్‌ల్లు యథేచ్ఛగా దోపిడీ సాగించడం, గిరిజనేతరులు పెద్ద ఎత్తున భూముల్ని స్వాధీనం చేసుకోవడం ఆదివాసీల సంప్రదాయ జీవన పరిస్థితిని అతలాకుతలం చేసింది. వారిలో తిరుగుబాటు ఆలోచనలకు కారణమైంది. అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో... ఆదివాసీల మౌలిక సమస్యల పరిష్కారం కోసం, బ్రిటిష్ వలస పాలన అంతంకోసం 1922 ఆగష్టు నుండి 1924 జూన్ వరకు విశాఖ,గోదావరి మన్య ప్రాంతంలో మహోధృ త పోరాటం సాగింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన ఈ పోరు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మన్యం విప్లవంగా ప్రాచుర్యం పొందింది. మన్య విప్లవం ప్రారంభమై వంద సంవత్సరాలవుతోంది. ఆ పోరాట లక్ష్యాలు నేటికీ నెరవేరలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఓడించి దేశానికి స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్ళు అయ్యింది. కానీ దోపిడీ, పెత్తనం పోలేదు. తెల్లదొరలు పోయి నల్లదొరల పాలన వచ్చినా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదు. దేశ సంపదను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టే విధానాలతో దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోంది. అల్లూరి మన్య విప్లవ పోరాట లక్ష్యమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నేడు మరింతగా ముందుకు తీసుకోపోవాల్సి ఉంది. అల్లూరి, మన్య పోరాట ఆదివాసీలు ఏ మౌలిక సమస్యల పరిష్కారం కోసమైతే పోరాడారో అవి నేటికీ పరిష్కారం కాలేదు. ఆదివాసీ గూడేలన్నింటినీ పర్యటించి ఈ పరిస్థితులను అధ్యయనం చేసిన అల్లూరి మన్యం పోరాటానికి ఆదివాసీలను సమాయత్తం చేయ నారంభించాడు. ఆదివాసీ యువకులను ఎంపిక చేసుకొని సాయుధ శిక్షణ ప్రారంభిం చాడు. తాను స్వయంగా విల్లును, తుపాకిని ఉపయోగించడం నేర్చుకున్నాడు. 1922 జనవరి నుండి ఆదివాసీలు వివిధ రూపాలలో తమ ధిక్కారాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి చూపించనారంభించారు. అలా మన్య తిరుగుబాటు మొదలైంది. అల్లూరి నాయకత్వ శిక్షణలో ఆగష్టు 22న 150 మంది ఆదివాసీ గెరిల్లాలు చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఇదే మన్య పోరాట తొలి ఘటనగా చరిత్రలో నిలిచిపోయింది. వెనువెంటనే కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి, దేవిపట్నం పోలీస్ స్టేషన్లను ముట్టడించారు.ఈ పోరాట ఘటనల అనంతరం అన్నవరం పర్యటనకు వచ్చిన అల్లూరికి ప్రజలు జేజేలు పలికారు.మూడు సంవత్సరాల పాటు విశాఖ మన్యంలో ప్రారంభమైన పోరాటం గోదావరి మన్యం వరకూ పెద్దఎత్తున సాగింది. ఈ పోరాటాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తీవ్ర దమనకాండతో అణచివేసింది.ఈ పోరాటం ఆనాడు అణచివేయబడినా పోరాట లక్ష్యాల సాధన కోసం ఆదివాసీలు అప్పటి నుండి ఈనాటి వరకూ అనేక ఉద్యమాలు సాగిస్తునే ఉన్నారు. నేటికీ పోడు పట్టాల కోసం ఉభయతెలుగ రాష్ట్రాల్లో గిరిజనులు పోరాడుతున్నా వారికి న్యాయం దక్కడం లేదు. ప్రభుత్వాలు ఇప్పటికైనా అల్లూరుని స్ఫూర్తిగా తీసుకుని సమస్యలకు తెరదించాలి.

# మన్యం ఉద్యమ నేత అల్లూరి

**పోరాట పంథాను నేర్పిన విప్లవజ్యోతి**

విశాఖపట్టణం,మే8 (ప్రజామంటలు): అల్లూరి సీతారామరాజు1897 జులై 4న విశాఖ జిల్లా పాండ్రంగి గ్రామంలో తన తల్లి పుట్టింట పుట్టాడు. తండ్రి స్వగ్రామం ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరం పట్టణానికి 10 కి.మీ. దూరంలో వున్న మోగల్లు గ్రామం. గోదావరి జలాలతో సస్యశ్యామలమైన ప్రాంతమిది. హైస్కూల్ లో చదువుతున్నప్పుడే నిరంతరం ఏదో ఆలోచనలు చేస్తున్న విలక్షణమైన విద్యార్థిగా ఉండే వాడు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆయన సహధ్యాయి మద్దూరి అన్నపూర్ణయ్య...అల్లూరి ఆలోచనలను కొన్నింటిని తన గ్రంథంలో పేర్కొన్నారు. అల్లూరి హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే లోకోద్ధరణకు ఉపకరించే విద్యయే నిజమైన విద్య అన్నారని అన్నపూర్ణయ్య రాశారు. అర్హతలు, అవకాశాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగాలు, డబ్బు సంపాదన గురించి ఎన్నడూ ఆలోచించలేదు. ఏదో చేయాలనే నిరంతరం తపన పడేవాడు. ఈ ఆలోచనలను ఆచరణలో పెట్టడం కోసమే 1913-17 మధ్య తుని సమీప ప్రాంతంలో ఉన్న ఆటవీ ప్రాంతంలో సంచారం చేశాడు. ఆదివాసీ జీవితాలను తొలిసారిగా పరిశీలించాడు. 1916 ఏప్రిల్ 26న దేశ యాత్ర ప్రారంభించి ఉత్తర భారత దేశంలో విస్తృతంగా పర్యటించాడు. తొలితరం కాంగ్రెస్ ఉద్యమ నాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీని కలకత్తాలో కలిసి చర్చించాడు. స్వాతంత్ర్య సమర యోధుడు పృథ్వీసింగ్‌తో పరిచయం చేసుకున్నాడు. చిట్టగాంగ్ విప్లవ వీరులతో పరిచయాలు చేసుకొని ఆ పోరాట అనుభవాలను అవగాహన చేసుకున్నాడు. ఉత్తరదేశ యాత్రలు ముగించుకొని 1917 జులై 17న విశాఖ మన్యం కృష్ణదేవిపేటకు చేరుకున్నాడు. అప్పటికి ఆయన తన భవిష్యత్తు జీవిత మార్గాన్ని నిర్దేశించు కున్నట్టు స్పష్టమవుతుంది. మొదట విశాఖ మన్య ప్రాంతమంతా విస్తృతంగా పర్యటించి ఆదివాసీలకు బాగా చేరువయ్యాడు. కృష్ణదేవిపేట లోని ఓ కుటీరంలో ఆకులు, మూలికలతో ఆయుర్వేద వైద్యం చేయనారం భించాడు. తాండవ నది గట్టుపైన చిన్ని కుటీరం ఏర్పరచి ఆదివాసీలకు రాత్రి పాఠశాల నిర్వహించాడు. ఆదివాసీ గూడేలలో మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. మీ మధ్య వచ్చే వివాదాలను పోలీస్ స్టేషన్లు, కోర్టులకు పోకుండా మీ గ్రామాలలో మీరే పంచాయితీలు పెట్టుకొని పరిష్కరించుకోమని ఆదివాసీలకు చెప్పాడు. మొదటి దశలో ప్రజా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించిన అల్లూరి మలి దశలో సాయుధ పోరాటానికి సమాయత్తం కావాల్సిన పరిస్థితులు విశాఖ-గోదావరి మన్యంలో ముందుకు వచ్చాయి. మొదట దేశయాత్ర సందర్భంగా కాంగ్రెస్ సంస్థ ప్రభావంలో ఉన్నాడు. లక్నో కాంగ్రెస్ మహాసభకు కూడా వెళ్లాడు. 1922 ఫిబ్రవరి 12న గాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమం అర్ధంతరంగా నిలిపివేశారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్న ఈ ఉద్యమం అర్ధంతరంగా నిలిపివేయడంతో భారత దేశంలోని అనేక మంది యువ స్వాతంత్ర్యోద్యమ నాయకులు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి కొత్త మార్గాలను అన్వేషించడం ప్రారంభించారు. ఆంధ్ర ప్రాంతంలో అల్లూరి ఆ విధంగా కొత్త మార్గాన్ని చేపట్టాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఓడించి దేశ స్వాతంత్ర్యాన్ని సాధించాలంటే సాయుధ పోరాటమే మార్గమని, మన్యం విప్లవం ప్రారంభించాలని నిశ్చయించుకున్నాడు. అదే అల్లూరిని విప్లవవీరుడిగా నిలిపింది. అయితే 1924 మే7న అల్లూరి సీతారామరాజును నాటి బ్రిటిష్ పాలకులకు చెట్టుకు కట్టి కాల్చి చంపారు.

## చింతగట్టులో ఇంటింటా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దివ్యారాణి రాజు నాయక్



హసన్ పర్తి మే 08 (ప్రజామంటలు):
హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం 65వ డివిజన్ చింతగట్టు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దివ్యారాణి రాజు నాయక్. బి.ఆర్.ఎస్. ప్రభుత్వంలో ఎలా వుంది. ఇపుడు ఎలా ఉంది. నిత్యం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లో కరెంట్ పోతుంది. నీళు సరిగా రావడం లేదు. పింఛన్లు సరిగా ఇవ్వడం లేదు. విలీన గ్రామాల అభివృద్ధి పటించుకోవడం లేదు. రైతు బందు పడటం లేదు. రైతు బీమ లేదు. రైతు రుణమాఫీ లేదు. మహాలక్ష్మి పథకం లేదు. అరుగ్యారంటీ లు అంగింట్లో కలిపారు. సరిగా అమలు కావడం లేదు. ఆరు నెలల పాలనను అర్ధానగ్నంగా ఆగమాగం చేశారు. కాబట్టి మనం తెచ్చుకున్న తెలంగాణను ఇంకా అభివృద్ధి పదం చేయాలంటే తెలంగాణను తెచ్చిన కెసిఆర్ సార్ ను గెలిపించు కోవాలి. కారు గుర్తుకు ఓటు వేయాలి అని ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామ అధ్యక్షులు, మహిళ నాయుకులు, యూత్ నాయకులు, సీనియర్లు, జూనియర్లు, కార్పొరేటర్ గార్లు బిఆర్ఎస్ గెలుపుకోసం ఇంటింటా ప్రచారం జోరుగా చేస్తున్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

జమ్మికుంట మే 08 (ప్రజామంటలు ):



జమ్మికుంట పట్టణంలో గాంధీ చౌరస్తా నందు గౌరవ పెద్దలు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ అన్న గారి జన్మదిన వేడుకలు సాయిని రవి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సాయిని రవి మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకమంది మహిళలకు రవాణా శాఖ ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన మహనీయులు పున్నం ప్రభాకర్ అన్న తెలియజేస్తూ అదే విధంగా రావణ రోజుల్లో ఉన్నత శిఖరాలకు అవరోధించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఆయన ఆయన కుటుంబ సభ్యులు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఆయన చేసిన పోరాటంలో గుర్తుచేస్తూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జమ్మికుంట కౌన్సిలర్లు శ్రీపతి నరేష్, పొనగంటి మల్లయ్య, పిట్టల రమేష్ శ్వేత, దిడ్డి రామ్మోహన్, కుతటి రాజయ్య, పొనగంటి రాము, రావికటి రాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, తుమ్మేటి సమిరెడ్డి, గూడెపు సారంగపాణి, సుంకరి రమేష్, ఎండి సలీం పాష, గడ్డం దీక్షిత్ గౌడ్, ఎగ్గని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరిన జమ్మికుంట మాజీ ఎంపీపీ

జమ్మికుంట మే 08 (ప్రజామంటలు):



ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది ముఖ్యంగా హుజురాబాద్ నియోజకవర్గం లో టిఆర్ఎస్, బిజెపి పార్టీలు పూర్తిస్థాయిలో క్లీన్ స్విప్ట్ అయ్యే పరిస్థితి ఆగుపడుతుంది. బుధవారం హుజరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జమ్మికుంట మాజీ ఎంపీపీ నేరెళ్ల రాజమల్లుగౌడ్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రణవ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నేరెళ్ల రాజమల్లు గౌడ్ జమ్మికుంట మండలంలో మడిపల్లి గ్రామ వాస్తవ్యులు సర్పంచిగా, ఎంపీటీసీగా, ఎంపీపీగా గత 40 సంవత్సరాల నుంచి రాజకీయంగా ఏదో ఒక పదవిలో ఉంటూ ప్రజాసేవలో ఉన్నటువంటి వ్యక్తిగా మంచి గుర్తింపు ఉంది, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్రావు గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపాడు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకమల్ల అశోక్, ఎగ్గేటి సదానందం, కాయిత లింగారెడ్డి పాల్గొన్నారు.

## రైతులు పండించిన వరి ధాన్యం ప్రతి గింజను కొంటాము

### పౌరసరఫరాల కమిషనర్ డి.ఎస్. చౌహాన్

జగిత్యాల రూరల్ 08 (ప్రజామంటలు):



రైతులు పండించిన వరి ధాన్యం ప్రతీ గింజను కొలుగోలు చేస్తామని పౌరసరఫరాల కమీషనర్ డి.ఎస్. చౌహాన్ అన్నారు. బుధవారం మల్యాల మండలం రామన్నపేట్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని, రైతులకు సహకరిస్తామని, భరోసా కల్పిస్తామని తెలిపారు. గత రెండు మూడు రోజుల నుండి పలు జిల్లాల్లో పర్యటిస్తున్నామని, అకాల వర్షాల వలన రైతులు భయపడాల్సిన అవసరం లేదని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ప్రతీ గింజను కొంటామని తెలిపారు. ఎండ ఉన్న సమయంలో ధాన్యం తూకం వేసి సంచుల్లో నింపాలని అన్నారు. ధాన్యం తేమ శాతం ఆయన పరిశీలించారు. కల్లాల లో ఉన్న ధాన్యం రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గన్నీ సంచులు, టార్పాలిన్ అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుకు డబ్బుల చెల్లింపు విషయం రైతుకు ఫోన్ చేసి స్వయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్ రావు, జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్ రావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హతిరాం, తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎంపీ అభ్యర్థి అరవింద్ కు మద్దతుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ప్రచారం

సారంగాపూర్ మే 08 (ప్రజామంటలు):
భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ కి మద్దతుగా బుధవారం సారంగపూర్ మండలములోని లచ్చక్క పేట గ్రామంతో పాటు పలు గ్రామాల్లో స్థానిక మహిళలతో కలిసి నరేంద్ర మోడీ అభివృద్ధి మరియు పథకాల గురించి వివరించి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ని గెలిపించాల్సిందిగా అభ్యర్థించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండల్ అధ్యక్షులు ఎండబెట్ల వరుణ్ కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షులు దిటి వెంకటేష్,బూత్ అధ్యక్షులు గోపినేనిభూమేష్, చెట్లపల్లి భాస్కర్, కంభం వెంకటరెడ్డి, చిట్యాల భూమరెడ్డి, బొడ్డుపల్లి తిరుమల్,కంభం రవీందర్, ఎగ్గె రాజు, దారు తిరుపతి, ఆకుల సంతోష్, ఇడిగినేని వెంకటేష్, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్

జమ్మికుంట మే 08 (ప్రజామంటలు):



కాంగ్రెస్ పార్టీలో చేరిన తాజా మాజీ సర్పంచ్ లకు సమచిత స్థానం ఇవ్వడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గంగాడి తిరుపతిరెడ్డి. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ముఖ్య అనుచరుడుగా వున్న గంగాడి తిరుపతిరెడ్డి తోపాటు పలువురు ముఖ్య బి.ఆర్.ఎస్. నాయకులు వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ గారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించడంతోపాటు రానున్న రోజుల్లో వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం ఖాయమని, పార్లమెంటు ఎన్నికల్లో వీణవంక మండలంలో అత్యధిక శాతం కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వస్తాయనే నమ్మకం ఉందని అన్నారు.

## పొన్నం అనూప్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు



ఎల్కతుర్తి, మే 08 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామం నుండి వద్దకొండ రాణా ప్రతాప్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ యువ నాయకులు పొన్నం అనూప్ సమక్షంలో యువకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలోకి వస్తున్న వారికీ కాంగ్రెస్ కండవా కప్పి అనూప్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనూప్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడెం రవి తేజ, తాళ్లపల్లి దిలీప్, గూడెం దినేష్, గూడెం వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను వివరిస్తూ ప్రచారం చేయాలని దిశానిర్దేశం కల్వకుంట్ల సుజిత్ రావు



మెట్ పల్లి మే 08 (ప్రజామంటలు):
కోరుట్ల నియోజకవర్గం సుజిత్ రావు నివాసం లో మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండల నాయకులతో టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు మాట్లాడుతూ మన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల లోపే 500 కు వంట గ్యాస్ సిలెండర్ అలాగే మహిళలకు ఫ్రీ బస్సు, మరియు 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ , 10 లక్షల ఆరోగ్యశ్రీ ఆగస్టు 15 లోపు 2 లక్షల రైతు రుణమాఫీ, ఒక క్వింటలు వరికీ 500 బోనస్, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆటో డ్రైవర్లకు ప్రతి సంవత్సరం 12000 రూపాయలు ఉపాధి హామీ కూలీలకు ప్రతి సంవత్సరం 12, 000 రూపాయలు తెలంగాణ కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరులో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. తెలంగాణ ప్రజలను గతంలో కంటే సంతోషంగా ఉంచడమే లక్ష్యం. వారి హృదయాలను గెలుచుకోవడానికి ఇక్కడ కొన్ని సంపూర్ణ విజయవంతమైన పథకాలు ఉన్నాయి! కావున మీ ఊరిలో గడప గడప తిరుగుతూ చేసిన, చేయబోయే పథకాలను వివరిస్తూ ప్రచారం చేయాలని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి ని భారీ మెజారిటీ తో గెలిపించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, వేములవాడ దేవస్థాన మాజీ డైరెక్టర్ కూన గోవర్ధన్, జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అందె మారుతీ, మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ముల చిన్న రెడ్డి, ఉమ్మడి జిల్లా మస్య కార్మిక మాజీ డైరెక్టర్ కల్లెడ గంగాధర్, మెట్ పల్లి పట్టణ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుతబ్ పాషా, కోరుట్ల అసెంబ్లీ ఎన్ఎస్ యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల భరత్ రాజ్, రాములు, గోపిడి నరేష్, రెబ్బస్ మల్లేష్, అమ్ముల పవన్, కోరే రాజ్ కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## సస్పెండ్ చేసిన డాక్టర్ శ్రావణ్ కుమార్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



మెట్ పల్లి మే 08 (ప్రజామంటలు):
మెట్ పల్లి ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు పట్టణ అధ్యక్షులు డాక్టర్ గంగాసాగర్ పత్రిక మిత్రులతో మాట్లాడుతూ.... మూడు రోజుల క్రితం జరిగిన కోరుట్ల గవర్నమెంట్ హాస్పిటల్ లో డాక్టర్ శ్రావణ్ కుమార్ పై మరియు హాస్పిటల్ సిబ్బందిపై జరిగిన దాడిలో జరిగిన సంఘటనపై నిందితులను ఏ ఒక్కరిని అరెస్టు చేయకపోవడంపై ఐఎంఏ మెట్పల్లి శాఖ తీవ్రంగా ఖండిస్తోంది. అంతేకాకుండా డాక్టర్ శ్రవణ్ కుమార్ ను సస్పెండ్ చేయడాన్ని ఏకపక్షంగా తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నాము. సస్పెండ్ చేసిన డాక్టర్ శ్రావణ్ కుమార్ ని వెంటనే విధుల్లోకి తీసుకొని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ సంఘటనను ఖండిస్తూ ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టణ అధ్యక్షులు డాక్టర్ గంగాసాగర్ సెక్రెటరీ ఆనంద్ బాబు, డాక్టర్ జాకప్ కిరణ్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ నిర్మల్ రెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ పద్మ, డాక్టర్ త్రివేణి, డాక్టర్ మానస, మెట్పల్లి పట్టణ డాక్టర్లు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టినరోజు బీరన్న, రేణుక ఎల్లమ్మ దేవాలయాలలో పూజలు

ఎల్కతుర్తి మే 08 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమ బహుజన మహా నాయకులు మాన్యశ్రీ పొన్నం ప్రభాకర్ అన్న 56వ పుట్టినరోజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పండుగ జరుపుకున్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీరన్న, రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి , మాజీ అధ్యక్షుడు సుకినే సంతాజి గోపాల్పూర్ క్లస్టర్ ఇంచార్జ్, టిపిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి గౌరె మహేందర్ ,గోలి రాజేశ్వరరావు ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు, శీలం అనిల్ కుమార్ కాంగ్రెస్ నాయకులు ముష్కే శ్రీనివాస్, చిర్ర సుదర్శన్ గౌడ్ పెండ్యాల భాస్కర్, పాక రమేష్, గోడిశాల రాజయ్య గౌడ్, గూడెల్లి నవీన్ ,కడారి సురేందర్, కోరే పున్నం, కల్లెపు రాము, అంబాల స్వామి, డాక్టర్ రమేష్ బాబు కోతుల నడుమ క్లస్టర్ ఇంచార్జ్, శనిగరపు స్వరూప వెంకటేష్ జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## కారు గుర్తుకే మన ఓటు - బత్తుల కొమురయ్య పిలుపు

### తెలంగాణ సమస్యలపై పార్లమెంటులో గళం విప్పనున్న వినోద్ కుమార్

సైదాపూర్ మే 08 (ప్రజామంటలు):



సైదాపూర్ మండల్ పెరికపల్లి గొల్లగూడెం గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించిన నాయకులు బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పిల్లి కొమురయ్య మాజీ సర్పంచ్ బత్తుల కొమురయ్య, పెరుకపల్లి గొల్లగూడెం లో ఉపాధి ఉపాధి హామీ పనుల వద్ద ప్రచారం లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పెర్కపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు పిల్లి కొమురయ్య తో పాటు తాజా మాజీ సర్పంచ్ బత్తుల కొమురయ్య పిలుపునిచ్చారు బుధవారం సైదాపూర్ మండలం పెరిక పల్లి గొల్లగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న పని వద్దకు బిఆర్ ఎస్ పార్టీ తరుపున పోటీ- చేస్తున్న పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్ ని గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీల మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ప్రజలకు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. కానీ కె సి అర్ తెలంగాణ రాష్ట్రం తెచ్చి తెలంగాణ రాష్ట్రం లో 24 గంటల కరెంటు, రైతులకు ఉచిత కరెంటు, 24 గంటలు నీళ్లు అందించిన ఘనత కె సి ఆర్ దని అన్నారు. నేడు చెరువులు, కెనాల్ లలో నీళ్లు లేక రైతులు వేసిన పంటలకు నీరు అందక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజల వద్దకు వెళ్తుండగా... ప్రజలు రేవంత్ రెడ్డికి ఓటువేసి మోసపోయామని చెబుతున్నారన్నారు. గత 60 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఎన్నో పోరాటాలు చేసి, ఎంతో మంది అమరులైనారని, తెలంగాణ రాష్ట్రం తెచ్చిన ఘనత కె సిఆర్ ధని అన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వినోద్ కుమార్ కి ఓటు వేసి గెలుపించు కుంటామని ప్రజలు చెప్పారన్నారు. ఇంటింటి ప్రచారంలో తో పాటు ఉపాధి హామీ పనుల వద్ద ఇరు గ్రామాల ప్రజలకు వివిపియాడ్ ద్వారా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తాజా మాజీ సర్పంచ్ బత్తుల కొమురయ్య, భారత రాష్ట్ర సమితి మండల ఉపాధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ, నాయకులు బత్తుల మోహన్, రుద్రారపు రవీందర్, మిట్టపల్లి శ్రీనివాస్, చల్లూరి కుమార్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంఘ కుమార్, చింతం యాదగిరి, కాశవేనీ ఓదెలు, వేముల రవీందర్, బత్తుల మోహన్, బత్తుల సదానందం, ముత్యాల ప్రమీల, లక్కర్సు పద్మ, తిప్పని నిర్మల, చింతం రేష్మ, అరుకల రమేష్, పిల్లి అశోక్ కుమార్, మధునయ్య, అనిల్, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లోకి చేరికలు



సైదాపూర్ మే 08 (ప్రజామంటలు):
సైదాపూర్ మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన కానుగంటి బిక్షపతి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యాల మల్లేశ్, యాదవ్ సారబుడ్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కానుగంటి బిక్షపతికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## మంత్రి పొన్నం పుట్టినరోజు ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు

సైదాపూర్ మే 08 (ప్రజామంటలు):



హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పుట్టినరోజు వేడుకలను బుధవారం రోజున మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు దొంత సుధాకర్ తో పొన్నం రోహిత్ కలిసి, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండలంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు పండ్లు ఫ్రూట్స్ అందజేసిన జన్మదిన వేడుకలను అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్, కలిసి రాష్ట్ర మంత్రి కుమారుడైన రోహిత్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య గుండారం శ్రీనివాస్, రాఘవులు, చాంద్ పాషా చైతన్య ,కొండారెడ్డి, అరుణ మల్లయ్య ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సారబుడ్ల రాజిరెడ్డి, కొండ గణేష్, కూతురు విద్వాన్ రెడ్డి, ముత్యాల మల్లేష్ యాదవ్ మేకల రాజు మారుపాక తిరుపతి జంపాల చంద్రయ్య అందే వెంకటేశ్వర కొత్త మహేందర్ రెడ్డి కొత్త మల్లారెడ్డి మాజీ ఎంపిటిసి సభ్యులు, బైరి రాజు, మండల కొమురయ్య, సిరంశెట్టి శ్రీనివాస్, కనకయ్య, సత్యనారాయణ రెడ్డి, వెల్దిరాజు యాదగిరి, పంతంగి రవీందర్, వస్తూరి శ్రీనివాస్, తాళ్లపల్లి వెంకటేశం, పెద్ది తిరుపతి, గుండెవేని రాములు, జెల్ల శ్రీనివాస్, భాషవేణి సంపత్, సీనియర్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## భావితరాల భవిష్యత్తు కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటేయండి

### మోడీ చేసిన అభివృద్ధి పనులు గడపగడపకు బిజెపి ప్రచారం

ఇబ్రహీంపట్నం మే 08 (ప్రజామంటలు):
ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాలలో మన ప్రియతమ ప్రధాని మోడీ మరియు నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి అరవింద్ ల గురించి ప్రచారం నిర్వహించారు. ఇట్టి ప్రచారంలో భాగంగా మన బిజెపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరిగినది. ఇంటింటికి గడపగడపకు తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రపంచంలోనే మన దేశాన్ని అగ్రగామి దేశంగా తీర్చిదిద్దుతున్న నరేంద్ర మోడీ గారి ఆధ్వర్యంలోని భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఎందరో పసిపిల్లల ప్రాణదాత డైనమిక్ లీడర్ శ్రీ ధర్మపురి అరవింద్ గారిని. దేశం కోసం ధర్మం కోసం మన భావితరాల భవిష్యత్తు కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరడం జరిగింది. ఇట్టి ప్రచారంలో బూత్ అధ్యక్షులు శక్తి కేంద్రం ఇంచార్జ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## టిఆర్ నగర్ బస్తీ దవాఖాన వద్ద రెడ్‌క్రాస్, రెడ్ క్రెసెంట్ దినోత్సవ వేడుకలు

### ఎంఎంయు వైద్య శిబిరము



జగిత్యాల మే 08 (ప్రజామంటలు): ప్రపంచ రెడ్‌క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ దినోత్సవం సందర్భంగా జగిత్యాల టిఆర్ నగర్ లో బస్తీ దవాఖాన వద్ద రెడ్‌క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ దినోత్సవ వేడుకలు నిర్వహించడంతో పాటుగా మొబైల్ మెడికేర్ యూనిట్ వైద్య శిబిరం నిర్వహించారు. జగిత్యాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ద్వారా బుధవారం ఉదయం 11-30 గంటల ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా సంక్షేమశాఖ అధికారి, వెటర్నరీ ఎడి డా. బోనగిరి నరేష్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి కుందారపు లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సెక్రటరీ మంచాల కృష్ణ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్ మరియు బస్తీ దవాఖాన వైద్యులు డా.సందీప్, వైద్య సిబ్బంది, ఏఎన్ ఎం, ఆశా వర్కర్లు, ఉమెన్ ఎంపోవర్ మెంట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ రెడ్‌క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ దినోత్సవం ను పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రెడ్ క్రాస్ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటుగా అత్యవసర పరిస్థితులలో ప్రాణాలు కాపాడడానికి గాను రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ, పలు సామాజిక కార్యక్రమాలు జరుపుతున్నందుకు గాను హర్షం వ్యక్తం చేశారు. రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ రెడ్‌క్రాస్‌ను ప్రారంభించి నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న మొదటి వ్యక్తి హెన్రీ డ్యూనాంట్‌ను స్మరించుకోవడానికి గాను ప్రతి సంవత్సరం మే 8 న ప్రపంచ రెడ్‌క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ దినోత్సవం జరుపుకుంటారని వివరించారు జిల్లా కమిటీ చైర్పర్సన్ గా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆధ్వర్యంలో జిల్లా రెడ్ క్రాస్ ద్వారా రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని శ్రీనివాస్ వివరించారు.

# డబ్బుకు మద్యానికి అమ్ముడుపోవద్దు



### మన ఐదు సంవత్సరాల జీవితం తాకట్టు పెట్టొద్దు

### 'పండ్ల బుట్ట' గుర్తుకు ఓటేసి గెలిపించండి

### పిపిఐడి పార్టీ ఎంపీ అభ్యర్థి మోతే నరేష్

జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 08 (ప్రజామంటలు): పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి నియోజకవర్గంలో పిపిఐడి పార్టీ అభ్యర్థి మోతే నరేష్ వినూతన పద్దతిలో తన ప్రచారం ను నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ.... మీ అమూల్యమైన ఓటు నిజాయితీగా వెయ్యండి.

**" అయ్యా! నీ బాంచన్, కాళ్లు మొక్కుతా! డబ్బుకు మద్యానికి అమ్ముడుపోకు, మన ఐదు సంవత్సరాల జీవితం తాకట్టు పెట్టకు"**

మీ ఓటు నిజాయితీగా వెయ్యండి అని ప్రచారం కొనసాగించారు. పిపిఐడి పార్టీ 22 రాష్ట్రాల్లో 145 ఎంపీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఉన్న ధర్మపురి నియోజకవర్గం లోని అంబారిపేట గ్రామం, ఎండపల్లి మండలం, జగిత్యాల జిల్లా చెందిన మోతే నరేష్ 2018 ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడు, 2020 బై ఎలక్షన్ లో ఎమ్మెల్యేగా దుబ్బాకలో పోటీ చేసి ఓడిపోయాడు, 2023 ఎలక్షన్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడు, 2024 ఎంపీ ఎలక్షన్లో పోటీ చేశారు. ఈసారి తనను పెద్దపల్లి ఎంపీగా గెలిపించండి అని పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఉన్నటువంటి యువతి, యువకులు, మేధావులు, ఉద్యోగస్తులు, రైతులు , సింగరేణి కార్మికులు, ఆటో డ్రైవర్స్ ప్రతి ఒక్కరూ మీ అమూల్యమైన ఓటు సీరియల్ నెంబర్ 14 పండ్ల బుట్ట పై ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపించాలని ఓటర్ దేవుళ్లను కోరుచున్నారు. అలాగే తమ పార్టీ యొక్క పిపిఐడి పార్టీ 14 అంశాలపై మానిపెస్టో విడుదల ఏవిదంగా ఉంది. విద్య , వైద్యం ఉచితంగా అందిస్తాం, ఉపాధి కల్పిస్తాం. నిరుద్యోగులకు 10 నుండి 20 లక్షలు లోన్ అందజేస్తాం. ఉపాధి కూలీలకు రోజువారీ కూలీ 500 ఇస్తాం. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానిస్తాం. వ్యవసాయానికి అనుబంధంగా ఉండే డైరీ ఫార్మ్, కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం, చేపల పెంపకం, పట్టు పురుగుల పెంపకం, కుందేళ్ళ పెంపకం ఇతర వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు 10 నుండి 50 లక్షలు ఎలాంటి హామీ లేకుండా లోన్ అందిస్తాం. ఆటో ద్వారా జీవనం పొందుతున్న వారికి ప్రతి లీటర్ పై 25% రాయితీ కల్పిస్తాం ప్రతి నెల భరోసా కింద 3000 అందిస్తాం. మహిళలకు 50% రిజర్వేషన్ కల్పిస్తాం. భూమిలేని నిరుపేదలకు వ్యాపారం చేసుకోవడానికి ఐదు లక్షలు లోన్ ఇస్తాం. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టిస్తాం. రేషన్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి 8 కిలోల సన్న బియ్యం ఇస్తాం. పప్పు, ఉప్పు, కారం, పంచదార, గ్యాస్, సబ్బు, పేస్టు నిత్యావసర సరుకులు కుటుంబ ఆదాయాన్ని బట్టి రేటు నిర్ణయిస్తాం. పెట్రోల్, డీజిల్ పై ఆదాయాన్ని బట్టి రేటు నిర్ణయిస్తాం. మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు మెటర్నిటీ లీవ్స్ 180 రోజులు ఉన్నదాన్ని 540 రోజులు పెంచుతాం. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రతి నెల 10 తారీకు లోపు జీతాలు అందిస్తాం. మా పార్టీ అధికారంలోకి వస్తే ఈ గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు పెద్దపెల్లి ఎంపీగా 'పండ్ల బుట్ట' గుర్తుకు ఓటేసి మోతే నరేష్ ను గెలిపించాలని కోరారు.

## ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

### మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి



జమ్మికుంట మే 08 (ప్రజామంటలు): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి ఏరియాలో రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.... పోన్నం ప్రభాకర్ అన్న ఎన్ ఎస్ యు ఐ నాయకునిగా రాజకీయ జీవితం ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగి తెలంగాణ రాష్ట్రం కోసం ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వంలో ఉండి ప్రతిపక్ష పాత్ర పోషించి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల అందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్లో కొట్లాడిన వ్యక్తి పోన్నం ప్రభాకర్ అన్న. ఆంధ్ర ఎంపీలు పోన్నం ప్రభాకర్ పై పెప్పర్స్ పై చేసినప్పటికీ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ బిల్లు పాస్ అయ్యే విధంగా పోరాడిన వ్యక్తి పోన్నం ప్రభాకర్ అన్న తను ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండాలని ఆ భగవంతుని ఆశీర్వాదం సంపూర్ణంగా ఉండాలని తను రాజకీయంగా అంచలంచెదగా ఎదగాలని ఆ భగవంతున్ని మనస్పూర్తిగా కోరుకుంటున్ననన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొంగోని వీరన్న, ఎలగందుల స్వరూప శ్రీహరి, దేశిని రాధా సదానందం, పొనగంటి సారంగం, మాజీ సర్పంచ్ పోరం అధ్యక్షులు మధు రెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రబెల్లి రాజేశ్వరరావు, జిల్లెల్ల తిరుపతిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి సజ్జు, కాంగ్రెస్ నాయకులు ఎర్రం సతీష్ రెడ్డి. దేశిని శ్రీనివాస్. ఉడత వెంకటేష్, ఓజ్జా శ్రీనివాస్, సంకిస సురేష్, కరుణాకర్ రెడ్డి, దేవరాజ్, రాజ్ కుమార్, మేడిపల్లి ఓదెలు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గజమాలతో 'పొన్నం' ను సత్కరించిన కోటి



జమ్మికుంట మే 08 (ప్రజామంటలు): దేశిని స్వప్న కోటి వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ అన్న రవాణా శాఖ %ద% బీసీ శాఖ మంత్రి జన్మదిన సందర్భంగా కరీంనగర్లో మంత్రి నివాసంలో పొన్నం ప్రభాకర్ అన్న కి గజమాలతో సన్మానించారు. అలాగే మంత్రి తో కేక్ కటింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దొంత రమేష్, హుజురాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గౌరవ కౌన్సిలర్లు బొంగోని వీరన్న. ఎలగందుల స్వరూప శ్రీహరి. దేశిని రాధా సదానందం. పొనగంటి సారంగం, మాజీ సర్పంచ్ పోరం అధ్యక్షులు మధు రెడ్డి వెంకట్ రెడ్డి,ఎర్రబెల్లి రాజేశ్వరరావు, జిల్లెల్ల తిరుపతిరెడ్డి, చినుముల వసంత రామస్వామి, సత్యనారాయణ రెడ్డి, మాధవరావు, లింగారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి సజ్జు తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి బల్మూరి ఆసరా

### రూ. 1,30,000 ఎలోసి అందజేత

జమ్మికుంట మే 08 (ప్రజామంటలు): హుజూరాబాద్ నియోజికవర్గం జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి 20వ వార్డుకు చెందిన విజయగిరి నాగార్జున గారి యొక్క కుమార్తె చిన్నారి విజయగిరి అనుశ్రీ గత కొన్ని రోజులుగా ఎముకల సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా చికిత్స భారీ ఖర్చుతో కూడుకోవడంతో ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ డా. బల్మూర్ వెంకట్ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి (ఎలోసి) మొదటి విడతగా 1,30,000/- ఒక లక్ష ముప్పైవేల రూపాయల ఎలోసి ని వారికి పంపడం జరిగింది. ఆ ఎలోసి ని హుజూరాబాద్ నియోజికవర్గ మైనారిటీ సెల్ చైర్మన్ 20వ వార్డు అధ్యక్షులు ఎండీ సలీం పాషా వారి కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు అధ్యక్షులు సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, 18వ వార్డు అధ్యక్షులు మారుతి రెడ్డి, 4వ వార్డు అధ్యక్షులు బిసడి వంశి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు అరుకల కార్తీక్, ఉమ్మడి సందీప్, ధర్మారం వార్డు ఫాజిల్ రహమాన్, మనోజ్ రెడ్డి, సదానందం, హరీష్, శ్రీకాంత్, సిద్దు, ఇర్ఫాన్ శివ తదితురులు పాల్గొన్నారు.

# సామాన్యుడి నేస్తం.. మన హస్తం..

### మండల కాంగ్రెస్ నాయకులు అశోక్



జమ్మికుంట మే 08 (ప్రజామంటలు): బీద ప్రజలకు అండగా, గరీబీ హటావో అనే నినాదంతో సామాన్యుడి జీవితాల్లో వెలుగులు నింపిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు గత 60 సంవత్సరాలలో చేసిన సేవను గుర్తు చేస్తూ రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వెలిచాలా రాజేందర్ రావు ను గెలిపించాలని కోరుతూ బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మ్యాకమళ్ళ అశోక్ ఆధ్వర్యంలో మడిపెల్లి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు...హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు గ్రామంలో పలు వార్డుల్లో ప్రచారం చేస్తూ గతంలో పార్టీ చేసిన సేవలు అలాగే రానున్న ఎన్నికల్లో 6 గ్యారంటీల అమలుకు హామీ ఇస్తూ మే 13న హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రజలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎగేటి సదానందం, పొన్నాల పుల్లారెడ్డి, వోల్లాల అంజి, యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఫయాజ్, చెన్నవేన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు అవగాహన లేదు

### మాజీ మార్కెట్ చైర్మన్ పోలినేని సత్యనారాయణ రావు



జమ్మికుంట (ప్రజామంటలు): జమ్మికుంట మండలం వెంకటేశ్వరపల్లి గ్రామం లో మాజీ మార్కెట్ కమిటీ చెర్మన్, బిఆర్‌ఎస్ సినీయర్ నాయకుడు పోలనేని సత్యనారాయణ రావు కరీంనగర్ ఎం.పి. అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ప్రచారంలో భాగంగా మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది బండి సంజయ్ కి పార్లమెట్ లో ఎం మాట్లాడలో కూడా తెలియని అవగాహనా లేని వేక్తి బీజేపీ అభ్యర్థి రాజేందర్ రావు కి ఎం.పి. లు గెలిస్తే ప్రధాన మంత్రి అవుతాడా ముఖ్యమంత్రి అవుతాడో కూడా తెలియని కాంగ్రెస్ అభ్యర్థి అని, అన్నివిషయాలో అవగాహనా ఉన్న వకీల్ మన బి.ఆర్.ఎస్. అభ్యర్థి వినోద్ కుమార్ అని వినోద్ కుమార్ గెలుస్తే కరీంనగర్ అభివృద్ధి జరుగుతది. ప్రజలకు పనిచేసే వినోద్ కుమార్ ని భారి మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మనోహర్ రావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**జగిత్యాల జిల్లాకు విచ్చేసిన ఫుడ్ అండ్ సివిల్ సప్లై ప్రిన్సిపల్ సెక్రెటరీ డి. ఎస్ చౌహాన్ ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్..**



## కడియం కావ్య గెలుపుపై గడపగడపకు కాంగ్రెస్ బొట్టు

హసన్ పర్తి మే 08 (ప్రజామంటలు): బైరాన్ పల్లి గ్రామంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు శ్రీ పోరెడ్డి మహేందర్ రెడ్డి ఆదేశానుసారం వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య గెలుపుపై గడపగడపకు కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బొట్టు కార్యక్రమాన్ని గ్రామ శాఖ మహిళా అధ్యక్షురాలు ములకపల్లి మౌనిక బైరాన్ పల్లి గ్రామ కమిటీ మరి యూత్ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మండల నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయడం జరిగింది. సుమారు 250 మంది మహిళ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అన్నారు గ్రామ శాఖ అధ్యక్షులు కల్లబోయిన కుమారస్వామి, ఉపాధ్యక్షులు జట్టి శంకర్, యువన సంఘం అధ్యక్షులు సంగిన బోయిన రామకృష్ణ, యూత్ కార్యదర్శి ముల్కపల్లి రవికుమార్.

## తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం

జమ్మికుంట మే 08 (ప్రజామంటలు): జమ్మికుంటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిశాల రాజేందర్ రావు ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఈరోజు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు కాంగ్రెస్ మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి గారు పూర్తి ప్రజా సంక్షేమం పైన దృష్టి పెట్టారని కేంద్రంలో బీజేపీ అవినీతి కార్పోరేట్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజా సంక్షేమ ప్రభుత్వం రావాలని దీని కోసం రాహుల్ గాంధీ గారు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర ద్వారా ఈరోజు మోడీ అమిత్ షా కార్పొరేట్ ఆదాని అంబానీల కుంభకోణాలను అవినీతి ని బయటపెడుతూ చేపడుతున్నారు దీనికి పెద్ద మొత్తంలో ప్రజలు స్వాగతం తెలియజేస్తున్నారు. గతంలో బిజెపి ప్రభుత్వం రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని మాట్లాడిన మాటలను నిలబెట్టుకోలేదు పేదల అకౌంట్ లో 15 లక్షల ఇస్తానని మోడీ ఇంతవరకు దాని ఊసే లేదని ఎద్దేవా చేశారు కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారం వస్తుందని బిజెపి కార్పొరేట్ పరిపాలన పోయి కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పరిపాలన వస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరు కాంగ్రెస్ గుర్తు హస్తం కు ఓటు వేసి కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకర రమేష్ సీనియర్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి పొన్నగంటి మల్లయ్య, సలీం, సాయిని రవి, శ్రీనివాస్, సారంగపాణి, మహిళా అధ్యక్షురాలు రేణుక, కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట కౌన్సిలర్లు, పట్టణానికి చెందిన వార్డు అధ్యక్షులు, నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ. కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఏం చేశారని కొప్పుల ఈశ్వర్ కు ఈప్రాంత ప్రజలు ఓట్లు వేయాలో చెప్పాలి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్



జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 08 (ప్రజామంటలు): వెల్గటూర్ మండలం ముత్తూనూర్, కొండపూర్ , రాంనూర్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలిసి పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశి ని భారీ మెజారిటీతో గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పంచ న్యాయాలను అధికారం లోకి రాగానే అమలు చేస్తామని, కొప్పుల ఈశ్వర్ ఈ పది సంవత్సరాల కాలంలో ధర్మపురికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని,వెల్గటూర్ మండల రైతాంగం వద్ద కాళేశ్వరం లింక్ 2 పేరుతో మూడు పంటలు పండే భూములను లాకున్న కనీసం స్పందించ లేదని,ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని చూస్తే ఇక్కడి ప్రాంత ప్రజలు తిరగబడి పోరాటం చేస్తే వారికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై, కార్యకర్తలపైన అక్రమంగా కేసుకు పెట్టించడం జరిగిందని,అయినప్పటికీ అప్పటి మంత్రి ఇక్కడి ప్రజలు గురించి ఆలోచించలేదని, అలాంటి కొప్పుల ఈశ్వర్ మళ్ళీ పెద్దపెల్లి ఎంపి అభ్యర్థిగా నిలబడి ఓట్లు అడగటానికి ప్రజలవద్దకు వస్తున్నారని, ఏం చేశారని కొప్పుల ఈశ్వర్ కు ఈ ప్రాంత ప్రజానీకం ఓట్లు వేయాలో చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు హస్తం గుర్తుకు ఓటు వేసి వంశి ని ఎంపి గా భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

## ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన గంటా



విశాఖపట్నం, మే 8 (ప్రజా మంటలు): భీమిలి నియోజక వర్గం మేనిఫెస్టోను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ఎట్టి పరిస్థితిలో మళ్లీ అధికారంలోకి రాకూడదని కూటమి పనిచేస్తుందన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. జూన్ 4న జగన్మోహన్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నారని అన్నారు. వైసీపీ పార్టీ మానిఫెస్టోలో దేనికి పొంతన లేదని... పాత మేనిఫెస్టోని కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా ఇప్పుడు తాము పొత్తు పెట్టుకున్నామని వివరించారు. గత ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి, నవరత్నాల అమలు చేస్తామని మోసం చేశారన్నారు. జగన్ నిక్కర్లు వేసుకోక ముందు నుంచి రాష్ట్రంలో టీడీపీ సంక్షేమం చేస్తోందన్నారు. భీమిలి అభివృద్ధి... ప్రత్యేక ప్రణాళికలు, సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హౌసింగ్ టౌన్షిప్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈసీని మోదీ మేనేజ్ చేస్తున్నారని అంటూ చెబుతున్న మాట.. బొత్స మాటనా?... లేక పార్టీ మాటనా? చెప్పాలని గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

# పల్నాడు జిల్లాలో ఉద్రిక్తత

## హోమ్ ఓటింగ్ విషయంలో వివాదం - టిడిపి కార్యకర్తలపై వైకాపా దాడి

పల్నాడు, మే 8 (ప్రజా మంటలు): పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదలలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ, వైసీపీ వర్గాలు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. హోమ్ ఓటింగ్ విషయంలో వివాదం చెలరేగింది. టీడీపీ సానుభూతి పరుడైన బషయ్య ఇంటికి ఓటు కోసం వైసీపీ వర్గాలు వెళ్లాయి. అదే సమయంలో టీడీపీ వర్గాలు సైతం అక్కడకు వచ్చాయి. టీడీపీ కార్యకర్తల ఇళ్లపై వైసీపీ వర్గాలు రాళ్లు రువ్వాయి. ఇదే సమయంలో మీడియాపై సైతం వైసీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. పోలీసులు అక్కడే ఉన్నా కూడా ప్రేక్షక పాత్ర వహించడం గమనార్హం. వైసీపీ కార్యకర్తల దాడిలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ వైసీపీ నేతల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇష్టానుసారంగా దాడులకు పాల్పడుతున్నారు. నయానో భయానో టీడీపీ కార్యకర్తలను దారిలోకి తెచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల టీడీపీ కార్యకర్తలపై దాడులకు వైసీపీ కార్యకర్తలు తెగబడుతున్నారు. ఇదంతా వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతోనే జరుగుతోందని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మౌన వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు వైసీపీ కార్యకర్తల మాదిరిగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

# ప్రజా స్పదంన లేకున్నా బాబు పాట్లు

## గెలిచే నమ్మకం లేకనే ఎన్నికల్లో పొత్తులు

## టిడిపి విమర్శలపై మండిపడ్డ అంబటి



గుంటూరు, మే 8 (ప్రజా మంటలు): చంద్రబాబు పర్యటనలో జన స్పందన లేకపోయినప్పటికీ అద్భుత ప్రజాదరణ అంటూ ఎల్లో మీడియా బాకాలు పలుకుతోందని జలవనరుల శాఖ మంత్రిఅంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ప్రజల్లో అంత ఆదరణ ఉంటే చంద్రబాబు ఒంటరిగా ఎందుకు పోటీ చేయరని, అందరూ కలిసి ఎందుకు పోటీకి దిగారని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసే దమ్ము లేక కలిసి పోటీ చేయడానికి వేదిక సిద్ధం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. 'పన్నులు లేకుండా ప్రభుత్వాలు నడుస్తాయా.. గతంలో చంద్రబాబు పన్నులు లేకుండానే ప్రభుత్వాన్ని నడిపారా' అంటూ ప్రశ్నించారు. నవరత్నాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు కాకూడదని కుట్రలో భాగంగానే ఈ రాద్ధాంతమంతా చేస్తుంటే, దానికి ఎల్లో మీడియా వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. అందుకే వైఎస్సార్‌సీపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా ఒంటరిగానే ప్రజల మద్దతు కోరుతోందని స్పష్టం చేశారు. ఓటమి భయంతో.. ఎవరికైతే ప్రజల మద్దతు లేదనుకుంటున్నారో.. వాళ్లే పొత్తుల కోసం చూస్తున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై సెటైర్లు వేశారు. చంద్రబాబుకు ఎన్నికలలో గెలుస్తామన్న నమ్మకం లేదు. చంద్రబాబును ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు. అసలు ప్రజల్లో ఆయన పట్ల విశ్వసనీయత లేదు. పైగా బాబుది దుర్మార్గపు ఆలోచన. ఎప్పుడూ ఇతరులపైనే ఆధారపడే తత్వం. పైగా వెన్నుపోటు పొడుస్తాడు అంటూ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. పెరిగిన ధరలపై చంద్రబాబు అనసర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగితే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి గానీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అనసర రాజకీయం చేస్తూ ప్రజల మెప్పుకోసం ప్రజల్లోకి రావాలని చూస్తున్నారని అన్నారు. సీఎం జగన్ లబ్దిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. నరేంద్ర మోడీని వ్యతిరేకిస్తే చంద్రబాబు సంపాదించిన లక్ష కోట్ల రూపాయల అవినీతి బయటపడుతుందని, ప్రశ్నించడం మానేశారని ఎద్దేవా చేశారు. వయసు మీదపడి చంద్రబాబు ఏంచేయాలో తెలియక ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి మండి పడ్డారు.

# ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

## చంద్రబాబుతోనే ఎపికి భవిష్యత్: సోమిరెడ్డి



నెల్లూరు,మే 8 (ప్రజా మంటలు): ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని టిడిపి నేత, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.. ప్రజా సమస్యలు, ప్రభుత్వ బాదుడే బాదుడుపై ప్రజల అభిప్రాయాలు, అవేదన, ఆగ్రహం రాష్ట్రంలోని ప్రభుత్వ వ్యతిరేకతను చాటాయని.. ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో ప్రజలు మార్పును కోరుకుంటున్న తీరు స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. తెలుగు తమ్ముళ్లలో కసి, ప్రజల్లో తెలుగుదేశం పార్టీపై ఆసక్తి రానున్న మార్పును సూచిస్తున్నాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఏపీ పునర్నిర్మాణం జరుగుతుంని చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాతే రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగుల వేస్తుందన్నారు.. కానీ, జగన్ పాలనా వల్ల రాష్ట్రం అప్పులపాలైందని విమర్శించారు. అయితే, ప్రస్తుతం సీట్లు గురించి చర్చే అవసరం లేదు.. ముందు జగన్ పరిపాలనకు చమరగీతం పాడాలన్నారు.. వైసీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఏపీని వ్యాపారం కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. సగటు ఏపీ పౌరుడు తలదించుకునే విధంగా జగన్ పరిపాలన ఉందన్నారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రను అపకీర్తిపాలు చేశారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం, ఎమ్మెల్యే సీట్లు కాకుండా అందరూ ఏపీ భవిష్యత్తుకోసం కలిసి రావాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

# పిడుగుల వాన పడే అవకాశం

## అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

అమరావతి,(ప్రజా మంటలు): బుధ, గురువారాల్లోనూ రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఈదురుగాలులు వీస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, పల్నాడు, బాపట్ల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని వివరించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటినుంచి మోస్తరు వర్షాలకు అవకాశముందని పేర్కొంది. మరోవైపు మంగళవారం కర్నూలు జిల్లా లద్దగిరిలో 43.4, ప్రకాశం జిల్లా ఎంద్రపల్లిలో 43.2, వైఎస్సార్ జిల్లా మద్దూరు, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.9 డిగ్రీల చొప్పున, నెల్లూరు జిల్లా మనుబోలు, నంద్యాల జిల్లా మహానందిలో 42.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం పిడుగుల వాన కురిసింది. భారీ వర్షానికి, ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అరటి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పిడుగుపాట్లకు ఐదుగురు, వేర్వేరు ఘటనల్లో మరో ఇద్దరు మొత్తం ఏడుగురు మృత్యువాత పడ్డారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరులో మొక్కజన్న చేలో పనిచేస్తున్న సమయంలో పిడుగుపాటుకు బందల నాగేంద్రం (52), ఆమె కుమార్తె యంద్రపల్లి నాగరాణి (25) మరణించారు. అదే మండలం కుందిరివానిపాలేనికి చెరదిన ఆవుల కోటేశ్వరరావు (45), బాపట్ల జిల్లా సంతమావులూరు గ్రామానికి చెందిన ఆయన మేనల్లుడు గోపి (25) గొర్రెలను మేపుతుండగా పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు. కొబ్బరి చెట్టు విరిగి మీదపడడంతో పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన రైతు నిమ్మల శ్రీనివాస్ (45) అక్కడికక్కడే మృతి చెందారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా బరకా కప్పేందుకు మోటార్ సైకిల్‌పై తన బాబారు ఇంటికి వెళ్లి బయట నుంచి ఆయనను పిలుస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆచంటకు చెందిన కౌలు రైతు కంకిపాటి శివయ్య (56) వర్షానికి ధాన్యం బస్తాలు తడవకుండా బరకాలు కప్పుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు ఆచంటలోని సిహెచ్‌సికి తరలించగా ఆయన అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం యడవల్లిలో పశువులు మేపేందుకు వెళ్లిన పరస రామారావు (41) పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఈదురు గాలులకు కృష్ణా జిల్లా గుడివాడలో పలుచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో, ట్రాఫిక్ స్తంభించిపోయింది. బస్టాండ్ పూర్తిగా మునిగి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కోనసీమ జిల్లా ఆలమూరు



మండలం బడుగువానిలంకలో అరటి చెట్లు, శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కేశవరాయపురం, లావేటిపాలెం, జిజి వలస, లావేరు, సంతవలసలో అరటి, బప్పాయి చెట్లు, ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో అరటి చెట్లు విరిగిపడ్డాయి. కృష్ణా జిల్లా బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, అవనిగడ్డ, నాగాయలంక తదితర మండలాల్లో వర్షానికి, ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజన్న, కళ్లాల్లో ఎండబెట్టిన ఎండు మిర్చి తడిచిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గంటన్నరపాటు భారీ వర్షం కురవడంతో రైల్వే స్టేషన్ రోడ్డు, తాడి తోట, శ్యామలా సెంటర్, కంబాల చెరువు ప్రాంతాలు నీట మునిగాయి. హైటెక్ బస్టాండ్ జలమయమైంది. కడియంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కాకినాడ జిల్లాలో శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు, రెడ్డిగూడెంలో వృక్షాలు నేలకొరిగాయి. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోనూ వర్షాలు కురిశాయి.

# ఓవర్సీస్ ఛైర్మన్ శ్యామ్‌పిట్రోడా రాజీనామా

దక్షిణాది వాళ్లు ఆఫ్రికన్ల మాదిరిగా' కన్పిస్తారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై భాజపా నేతలు మండిపడుతున్నారు. వారసత్వ పన్నుపై.. ఇటీవల కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసిన అనంతరం పిట్రోడా వారసత్వ పన్నుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో వారసత్వ పన్ను ఉంది. దాని ప్రకారం.. ఒక వ్యక్తి దగ్గర 100 మిలియన్ల డాలర్ల విలువైన సొత్తు ఉందనుకుంటే.. ఆ వ్యక్తి మరణం తర్వాత అందులో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు బదిలీ అవుతుంది. మిగిలిన 55 శాతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. అదొక ఆసక్తికరమైన అంశం. ఇది న్యాయంగానే ఉందని అన్నారు. రామమందిరంపై 2023 జూన్‌లో ఆయన రామమందిరంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్ ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్య, ఆరోగ్య సమస్యలను దేవాలయాలు పరిష్కరించలేవని అన్నారు. దేశవ్యాప్తంగా రామాలయం ప్రారంభోత్సవం కోసం ఎదురుచూసిన వేళ ఈ వ్యాఖ్యలపై భాజపా మండిపడింది. 1984లో చోటు చేసుకున్న సిక్కు వ్యతిరేక అల్లర్లకు అనుకూలంగా 2019 మేలో పిట్రోడా అనుచిత వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్నారు. పుల్వామా ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్.. పాకిస్థాన్ భూభాగంలోని బాలాకోట్‌పై వైమానిక దాడులు జరిపి ముష్కరులకు ముచ్చెమటలు పట్టించిన విషయం తెలిసిందే. భారత వైమానిక దాడుల సామర్థ్యంపై ఆయన అనుమానం వ్యక్తంచేస్తూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారమే రేపాయి. సైన్యాన్ని కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయంటూ పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. భారత రాజ్యాంగ రూపకల్పనలో బీఆర్ అంబేడ్కర్ కంటే.. భారత తొలి ప్రధాని నెహ్రూ పాత్రే ఎక్కువంటూ పిట్రోడా పెట్టిన సోషల్ మీడియా పోస్టు తీవ్ర వివాదానికి దారితీసింది. పిట్రోడా చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు లోక్‌సభ ఎన్నికల వేళ భాజపాకు అస్త్రాలుగా మారుతున్నాయి. ఇటీవల వారసత్వ పన్నుపై ఆయన చేసిన వ్యాఖ్యలపై భాజపా మండిపడింది. ప్రజలు చెమటోడ్చి సంపాదించిన సొమ్మును కాంగ్రెస్ నేతలు లాక్కోవాలను కుంటున్నారని విమర్శించింది. ఇక పిట్రోడా చేసిన తాజా వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. దేశాన్ని విభజించాలని కాంగ్రెస్ చూస్తోందని.. శరీర రంగు ఆధారంగా ప్రజలను అవమానిస్తే దాన్ని తానెప్పటికీ సహించబోనని ప్రధాని హెచ్చరించారు. మరోవైపు పిట్రోడా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నష్ట నివారణ చర్యలకు దిగింది. ఆయన వ్యాఖ్యలు వ్యక్తిగతమని, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు.

# పేదరికం పోతే ఉచిత బియ్యం ఎందుకు

## మోడీ తీరుపై మండిపడ్డ విహెచ్

హైదరాబాద్,మే8(ప్రజా మంటలు): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు విరుచుకుపడ్డారు. 25 లక్షల మందిని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వాళ్ళను పైకి తీసుకువచ్చామని మోదీ అంటున్నారని.. అదే నిజం అయితే ఉచిత బియ్యం ఎందుకు ఇస్తున్నట్లని ప్రశ్నించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పుకోవడంలో విఫలం అవుతున్నామని చెప్పు కొచ్చారు. మోదీ పదేళ్లలో ఏం చేశారో చెప్పడానికి ఏం లేదన్నారు. మరోసారి మోదీ వస్తే.. అదానీ అంబానీలను కోటీశ్వరులు చేస్తారు తప్ప పేదలకు ఏం చేయరని విమర్శించారు. రాహుల్ గాంధీ కుల గణన చేపడతామని అంటున్నారని.. ఓబీసీని సపరేట్ చేసింది రాహుల్ గాంధి అని అన్నారు. దేశం సమిష్టిగా ఉండాలి అంటే కాంగ్రెస్ రావాలని అన్నారు. స్వతంత్య్రం తెచ్చింది మహాత్మా గాంధీ అని.. బీజేపీ మీడియా పబ్లిసిటీ అసత్య ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకం వేతనం రూ.400 తప్పక చేస్తామని వి.హనుమంతరావు స్పష్టం చేశారు.

# కెసిఆర్ కొత్త నాటకాలతో వస్తున్నారు

## ఎన్నికట్టలు తీసుకుని వెంకట్రామిరెడ్డికి సీటు ఇచ్చారు

### మీడియా సమావేశంలో విమర్శలు గుప్పించిన రఘునందన్

సిద్దిపేట,మే8(ప్రజా మంటలు): బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ నయా నాటకాలకు తెర లేపుతున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... రఘునందన్ రావు దుబ్బాకలో ఓడిపోతే కేసీఆర్ కామారెడ్డిలో ఓడిపోలేదా అని అన్నారు. పోలీసులతో డబ్బులు పంచి గెలిచినందుకు కేసీఆర్‌కు సిగ్గు ఉండాలంటూ వ్యాఖ్యలు చేశారు. వెంకట్ రాంరెడ్డి ఎన్ని కట్టలు కట్టించినందుకు మెదక్ సీటు ఇచ్చావ్ కేసీఆర్ అని నిలదీశారు. కేసీఆర్ డబ్బులు ఇచ్చి గెలిచారని రాధ కిషన్ రావు చెప్పలేదా అని ప్రశ్నించారు. దుబ్బాక బై ఎన్నికల్లో నిన్ను, నీ అల్లున్ని కొట్టలేదా కేసీఆర్ అంటూ నిలదీశారు. సిద్ధిపేట జిల్లాలలో వంద మంది తనలాంటి జీవితాలను కేసీఆర్ ఆగం చేశారని మండిపడ్డారు. మెదక్‌తో కేసీఆర్‌కు పేగు బంధం ఉన్నదని సెంటిమెంట్ పండిస్తున్నారన్నారు. కేసీఆర్‌కు తెలంగాణ పౌరుషం ఉంటే డబ్బులు పంచలేదని వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. టీఆర్ఎస్‌లో పనిచేసిన నాయకులకు కేసీఆర్ ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడిగారు. కేసీఆర్ కామారెడ్డిలో, కూతురు నిజామాబాద్‌లో చెల్లలేదని.. కొడుకు ఎంపీగా పోటీకి ముందుకు రాలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్, హరీష్ రావుఃకు వెంకట్ రాంరెడ్డి బినామీ కాదని చెప్పాలని డిమాండ్ చేవఆరు. కేసీఆర్‌కు వెంకట్ రాంరెడ్డి ముద్దు అయితే శ్రీకాంత్ చారి తల్లికి ఎందుకు సీటు ఇవ్వలేదన్నారు. రఘునందన్ రావు మెదక్ ఎంపీగా గెలవడం ఖాయం... మిమ్మల్ని శ్రీ కృష్ణ జన్మస్థలంకు పంపడం ఖాయం అని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# తెలంగాణ కోసం కొట్లాడే పార్టీ బిఆర్ఎస్

## పార్లమెంటులో మనోళ్లు ఉంటేనే హక్కులు సాధిస్తాం

## మల్కాజిగిరిలో రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించాలి

## ప్రచారంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు



మేడ్చల్,మే8 (ప్రజా మంటలు): తెలంగాణ కోసం పేగులు తెగేదాకా కొట్లాడే ఒకే ఒక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని కేసీఆర్ అన్నారు. పార్లమెంటులో మనోళ్లు డజను మంది ఉంటేనే కచ్చితంగా తెలంగాణ హక్కులు కాపాడతారు.. తెలంగాణకు నిధులు తెస్తారని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దిగ్విజయంగా కొనసాగుతున్న కేసీఆర్ బస్సు యాత్ర బుధవారం మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలోని దుండిగల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరిలో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. మల్కాజ్‌గిరి పార్లమెంటులో టైగర్‌లాంటి ఎమ్మెల్యేలు ఉన్నారని కేసీఆర్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లో 85వేల ఓట్లతో గెలిచిన వివేకానంద ఉన్నాడు.. కూకట్‌పల్లిలో 70వేల ఓట్లతో గెలిచిన మాధవరం కృష్ణారావు ఉన్నారు.. ఇలా అసెంబ్లీ ఎన్నికల ప్రకారం చూస్తుంటే బీఆర్ఎస్‌కు దాదాపు 4 లక్షల మెజారిటీ వస్తుందని అన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి చాలా మంచి వ్యక్తి, నిజాయతీపరుడు అని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయాల్లో ఎప్పుడూ అవకాశం రాలేదు. ఫస్ట్ టైమ్ మనం టికెట్ ఇచ్చి నిలబెట్టుకున్నామని తెలిపారు. ' రాగిడి లక్ష్మారెడ్డి ఒక సంస్థ పెట్టి లక్షలాది మంది ప్రజలకు న్యాయం చేసిండు. వాటర్ ట్యాంకర్లు పెట్టి ప్రజలకు నీళ్లు సప్లై చేసిండు. పేదింటి బిడ్డల పెండ్లిళు చేసిండు. లక్ష్మన్న అని పిలిస్తే నేనున్నా అంటూ కదిలొచ్చే మనిషి రాగిడి లక్ష్మారెడ్డి. ' అని పేర్కొన్నారు. సభ్యత, సంస్కారం ఉన్న వ్యక్తి రాగిడి లక్ష్మారెడ్డి అని అన్నారు. మల్కాజ్‌గిరిలో రాగిడి లక్ష్మారెడ్డి ఆల్రెడీ గెలిచిపోయిండు.. ఎలక్షన్ తేలిపోయిందని వ్యాఖ్యానించారు. వరుసపెట్టి చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, మెదక్, గెలుస్తున్నాం.. పార్లమెంటు ఎన్నికల్లో డజనుకు పైచిలుకు సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలకు అర్థమయ్యిందని తెలిపారు. లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో తొలగని అయోమయం

## అధికారులకే అవగాహన లేదన్న వర్ల రామయ్య



అమరావతి,మే8 (ప్రజా మంటలు): పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఇంకా అయోమయం నెలకొందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అక్కడ ఇక్కడ అంటూ ఓటు వినియోగించుకోకుండా ఉద్యోగులను అధికారులు ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పోస్టల్ బ్యాలెట్‌పై చాలా మంది జిల్లా కలెక్టర్లకు, ఆర్వోలకు క్లారిటీ లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులు సక్రమంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్ దే అని తెలిపారు. ప్రధాని రాక నేపథ్యంలో చాలా మంది అధికారులు ఆ డ్యూటీలో పాల్గొంటున్నందున వారికి రేపు, ఎల్లుండి ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. బయట రాష్ట్రాల్లో విధుల్లో ఉన్న ఏపీ పోలీసులు వారి ఓటు వినియోగించు కునేందుకు పిలిపించాలని.. అలా కుదరని పక్షంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని తెలిపారు. పోలీసు నోడల్ ఆఫీసర్ ఎవరో స్పష్టంగా తెలియపరచాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే హోంగార్డుల జీవన ప్రమాణాలు పెంచే దిశలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీలో పాలనలో చాలా మంది పోలీసులు మానసిక క్షోభ అనుభవించారని... రేపు తాము అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులు ఉండవన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గౌరవ ప్రధంగా ఉద్యోగం చేసే పరిస్థితి ఉంటుందని చెప్పుకొచ్చారు. డీజీపీ మారడంతో జగన్ నోట ఓటమి మాట వస్తోందని.. ఎన్నికలు సజావుగా జరిగే అవకాశం లేదని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఓటమిని జగన్ రెడ్డి ముందే ఒప్పుకున్నారంటూ వర్ల రామయ్య వ్యాఖ్యలు చేశారు.

# బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

## దానిని ప్రజలు ఎప్పటికీ మరవరు

## తలసానితో కలసి పద్మారావు ప్రచారం

హైదరాబాద్,మే8(ప్రజా మంటలు): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, నిర్వహించిన సంక్షేమ పథకాలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, జీవై.కంపౌండ్, బోయగూడ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాల పట్ల ప్రజలు ఏవగించుకుంటున్నారని పద్మారావు పేర్కొన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ను గెలిపించాలని ప్రజలు అనుకుంటున్నారని పద్మారావు పేర్కొన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర మం త్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ద్వారా ప్రజలకు కలిగిన లాభమే లేదని విమర్శించారు. ఎంపీగా పద్మారావు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్‌ను ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ యువ నాయకుడు తీగుళ్ల కిరణ్‌కుమార్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ బుధవారం బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్‌లో తెలంగాణ బాణి వినిపించాలంటే కారు గుర్తుకు ఓటు వేసి పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు.

# వేములవాడ రాజన్నను సేవలో మోడీ

## ప్రత్యేక పూజల నిర్వహణ.. కోడె మొక్కు తీర్చుకున్న ప్రధాని



కరీంనగర్, మే 8 (ప్రజా మంటలు):

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోభాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం మరోసారి తెలంగాణ పర్యటనకు వచ్చారు. వేములవాడ, వరంగల్ లలో నిర్వహించే బహిరంగ సభలలో ప్రసంగించారు. బుధవారం ఉదయమే హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన రాజ్‌భవన్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వేములవాడకు చేరుకున్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని కోడెమొక్కులు తీర్చుకున్నారు. ప్రధాని మోడీ ఆలయ విశేషాలు అడిగి తెలుసు కున్నారు. ప్రధాని మోడీకి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు. ఆలయంలోని మహానందికి పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు కూడా పూజలు నిర్వహించిననంతరం ఆలయంలో ప్రదక్షిణ చేస్తూ రాజరాజేశ్వర స్వామి గర్భాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆలయ ప్రధాన అర్చకులు మోదీకి తిలకధారణ చేసి స్వామివారికి పుష్పార్చనలు నిర్వహించారు. తదనంతరం ప్రధాని మోదీ హారతి కళ్లకు అద్దుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, ప్రధాన అర్చకులు, వేద పండితులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆపై శాలువా కప్పి సన్మానించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇక తిరుగుపయనం అయ్యే క్రమంలో క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు అభివాదం చేస్తూ, వందనం చేస్తూ బయటకు వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్ లో వేములవాడ బహిరంగ సభకు బయలుదేరారు. ప్రధాని రాకతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

# మోడీ ఒక్కహామీ కూడా ఇవ్వలేదు: వినోద్

కరీంనగర్, మే 8 (ప్రజా మంటలు):

ఎన్నికల ప్రచారంలో భాగంగా వేములవాడకు వచ్చిన ప్రధాని మోదీ ప్రజలకు ఒక్క హామీ కూడా ఇవ్వలేదని విమర్శించారు కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ . కాశీకి ఎంపీ అయిన మోదీ.. దక్షిణ కాశీకి వస్తున్నారంటే గొప్ప ప్రకటన చేస్తారనుకున్నారు. వేములవాడ ఆలయాన్ని తీర్చిదిద్దుతానని కూడా మోదీ చెప్పలేదన్నారు. ప్రసాద్ స్కీమ్ కింద వేములవాడ, కొండగట్టును చేర్చాలని తాను గతంలో కేంద్రాన్ని కోరినట్లుగా గుర్తుచేశారు. వేములవాడ అభివృద్ధికి నిధులు కోరితే ఇవ్వలేదన్న వినోద్ కుమార్.. ఇవాళ మోదీ హామీ ఇస్తారని ఆశించానన్నారు. వేములవాడ అభివృద్ధి గురించి బండి సంజయ్ ఎందుకు పట్టించుకోవట్లేదని వినోద్ కుమార్ ప్రశ్నించారు. కరీంనగర్ ప్రజలు బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని నిలదీశారు.

# కడియం శ్రీహరి నకిలీ దళితుడు

## మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

హనుమకొండ, మే 8 (ప్రజా మంటలు):

ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. బుధవారం హనుమకొండలో తాడికొండ రాజయ్య మాట్లాడుతూ.. కడియం శ్రీహరి నకిలీ దళితుడని ఆరోపించారు. అలాగే ఆయన కుమార్తె కడియం కావ్య నకిలీ మతస్థురాలన్నారు. శ్రీహరిపై కాంగ్రెస్ పార్టీలోని ఎమ్మెల్యేలంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. శ్రీహరిని ఓన్ చేసుకునేందుకు ఆ పార్టీలో ఎవరు ముందుకు రావడం లేదని చెప్పారు. అలాగే కడియం శ్రీహరిపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహంతో రగిలిపోతున్నారని చెప్పారు. ఈ నాలుగు నెలల్లో నాలుగు లక్షల మందికి కల్యాణ లక్ష్మి పథకం వర్తింప చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘనాపూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి గెలుపొందారు. అనంతరం ఆయనతోపాటు ఆయన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య పేరును బీఆర్ఎస్ పార్టీ ఖరారు చేసింది. అయితే తాను ఎన్నికల బరిలో దిగనంటూ.. కారు పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాసింది. ఆ క్రమంలో తాను ఎందుకు ఎన్నికల బరిలో నిలవడం లేదో కారణాలు సైతం ఆ లేఖలో పొందు పరిచింది. అనంతరం కడియం శ్రీహరి, కడియం కావ్య ఇద్దరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో వరంగల్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కడియం కావ్య పేరు ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఇటువంటి పరిస్థితుల్లో కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు మండిపడుతున్నారు.

# మోత్కుపల్లి కాదు..ఊసరవెల్లి

## కాంగ్రెస్ నేత శ్రీశైలం ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్,మే8 (ప్రజా మంటలు):

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తన ఇంటి పేరును 'ఉసరవెల్లి'గా మార్చుకుంటే పేరుకు తగినట్టు అర్థవంతంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.శ్రీశైలం వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మోత్కుపల్లిపై శ్రీశైలం నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీవ్రంగా దుర్భాషలాడుతూ మోత్కుపల్లి ట్విట్టర్‌లో చేసిన పోస్టుపై శ్రీశైలం అభ్యంతరం వ్యక్తం చేశారు. మాదిగల హక్కుల కోసం మాట్లాడుతున్న మోత్కుపల్లి గతంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించినప్పుడు ఏమి న్యాయం చేశారని ప్రశ్నించారు. ఒక్క మాదిగ కైనా ఆయన మేలు చేశారా..? అని నిలదీశారు. మోత్కుపల్లి సీఎంపై చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాదిగలు మోత్కుపల్లిని కుల బహిష్కరణ చేస్తారని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలుచేసిన మోత్కుపల్లి నర్సింహులుపై కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీశైలం కోరారు.



# వర్షాలకు నష్టపోయిన రైతులను అదుకుంటాం

## తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరలకు కొంటాం

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టీకరణ



నల్లగొండ, మే 8 (ప్రజా మంటలు):

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను అదుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సన్న రకం ధాన్యం ఎక్కువ ధరకు కొనే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తడిసిన ధాన్యం మద్దతు ధరకు కొంటామని వెల్లడించారు. రైతుబంధు వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఓటమి భయంతో రైతుబంధు ఆపించారని విమర్శించారు. రెండు లక్షలు రుణమాపి ఆగస్టు 15లోపు చేస్తామని ప్రకటించారు. నల్గొండ నియోజక వర్గం పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ వస్తుందని జూన్ 5 నుండి అవినీతికి తావు లేకుండా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పోలీసు కేసులు, షరాష్ మెంట్లు ఉండవని చెప్పారు. పంచాయితీ రాజ్ సమన్వయంతో రూ. 450 కోట్లతో నియోజక వర్గ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో 50 ఎకరాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కడుతామని వెల్లడించారు. మీడియా కొరకు ప్రత్యేకంగా ఎ÷–లాట్ లు, డబుల్ బెడ్ రూమ్ లు కట్టిస్తామని తెలిపారు. డిసెంబర్ వరకు అన్ని చెరువులు నింపేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందని అన్నారు. పెండింగ్ లో ఉన్నా మూసి, బ్రాహ్మణ వె÷–లళెంల ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ముస్లిం మైనార్టీ లకోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పారు. స్కిల్ డవెలప్మెంట్ కోసం రూ. 20 కోట్లు కేటాయించామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓపిక ఉంటే పోటీ చేస్తానని లేదంటే తమ నాయకులు పోటీలో ఉంటారని చెప్పారు. ప్రతీక్ పౌండేషన్ ఆధ్వర్యంలో విస్తృత సేవలు అందిస్తామని వెల్లడించారు. మల్లికార్జున్ ఖర్గే పర్యటన నకిరేకల్ లో ఉండే అవకాశం ఉందని చెప్పారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

# ఔటర్ రింగ్‌రోడ్డు అవినీతిపై నిగ్గు తేలేనా

## అనుమానాలకు తావిచ్చేలా లీజు నిర్ణయం - సమాధానం చెప్పని నాటి పాలకులు

హైదరాబాద్,మే8 (ప్రజా మంటలు):

ఔటర్ రింగ్‌రోడ్డు అవినీతిపై విచారణకు ఆదేశించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల అవినీతి జిరగిందని గుర్తించామని అన్నారు. ఎన్నికలకు ముందే విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. అయినా దీనిపై విపక్ష బిఆర్ఎస్ నోరుమెదపడం లేదు. ఏదైనా ఆరోపణలు రాగానే అంతెత్తు ఎగిరిపడే నేతలు అసలు మట్లాడడం లేదు. ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రికెటిఆర్ కూడా దీనిపై పెదవి విప్పడం లేదు. నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని బయట పడేశాక బిజెపి అందుకుంది. ఇప్పుడు సిఎం అయ్యాక రేవంత్ రెడ్డి దీనిపైనా స్పష్టత ఇచ్చారు. విజిలెన్స్ విచారణకు ఆదేశించామని, విచారణ కాగానే చర్యలు తీసుకుంటామని తాజాగా పలు టీవీ ఇంటర్వ్యూలలో స్పష్టం చేశారు. అయితే అవినీతి జరిగివుంటే.. లేదా నిబంధనలకు విరుద్ధంగా లీజ్ ఇచ్చివుంటే కేంద్రంలోని బిజెపి చర్యలు తీసుకోవచ్చు. నిజాలు నిగ్గు తేల్చవచ్చు. కానీ బిజెపి కాళేశ్వరం లేదా ఔటర్ లీజల విషయంలో కేవలం ఆరోపణలకే పరిమితం అవుతోంది. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం లీజుకు ఇచ్చే విషయంలో విపరీతమైన వివాదాలు నెలకొంటున్న వేళ నిజాలు నిగ్గు తేల్చాలి. నిజానికి ఓఆర్ఆర్ ను 30 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందన్న దానికి బిఆర్ఎస్ నుంచి సమాధానం రావడం లేదు. అధికారంలో ఉండగానూ, విపక్షంలోనూ సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఓఆర్ఆర్ లీజు తమ అనుకూలమైన వ్యక్తులకు ఇచ్చుకొని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశించామని చెప్పారు. హెచ్ఎండీఏ కు ఓఆర్ఆర్ పై టోల్స్ వసూలు చేయడం ద్వారా రాబోయే 30 ఏళ్లలో రూ.75 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంటున్నారు. లీజు ఏ కంపెనీకి టెండరు రావాలో ముందే నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను ఎందుకు ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చిందని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం లీజు ప్రక్రియ జరగలేదని ఆరోపించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యను బట్టి లీజు పరిమితిని తగ్గించుకోవచ్చని నిబంధనల్లో ఉందని, కానీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. ఓఆర్ఆర్‌ను 30ఏళ్ళ వరకు లీజ్‌కు ఇవ్వాల్సిన అవసరం ఏంటన్న దానికి నాటి మంత్రి కెటిఆర్ నుంచి సమాధానం రావడంలేదు. సగటు టోల్ గేట్స్ నుండి వచ్చిన ఆదాయం రోజుకు కోటి ఎనభై ఐదు లక్షలు దాటింది. ఏడాదికి సుమారుగా 720 కోట్లు ఆదాయం వస్తోంది. ముప్లై ఏళ్లపాటు లీజుకు ఇవ్వడమంటే సుమారుగా ఇరవై వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. కానీ తాజా లీజు కారణంగా కేవలం 30వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మరి అంతలా ఆదాయం వస్తున్న ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్స్ లీజును అప్పనంగా ఓ కంపెనీకి కేవలం 7380 కోట్లకు 30 ఏళ్లపాటు ఎలా కేటాయిస్తారంటూ గత ఎన్నికల ముందు ప్రశ్నించారు. వెంటనే ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోల్ గేట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రభుత్వమే టోల్ గేట్ లను నిర్వహిస్తూ బ్యాంక్ నుండి నిధులు తెచ్చి బ్యాంక్ వడ్డీ చెల్లించినా మంచి లాభాలు వస్తాయని, అలాంటిది ప్రజల సొమ్మును వేలకోట్ల రూపాయలు ఐఆర్‌బి అనే సంస్థకు అప్పగించడం వెనుక ఉన్న గూడుపుఠాణి బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అందులోనూ డిఫాల్టర్ గా ఉన్న ఐఆర్‌బి కంపెనీకి తిరిగి నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్ నిర్వహణ ఒప్పందం ప్రక్రియ వెంటనే ఆపకపోతే కోర్టుకు వెళతామని హెచ్చరించారు. ఈ వ్యహారంపై సిబిఐ, ఈడిల కు ఫిర్యాదు చేయడంతోపాటు ఈ టోల్ గేట్ కుంభకోణంపై పోరాటం చేయనున్నట్లు బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలిపారు. ఔటర్ వ్యవహారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా ఆరోపణలు చేశారు. ఇదేనా కేసీఆర్ చెప్పే గుణాత్మకమైన మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీజుతో కల్వకుంట్ల కుటుంబం కొత్త నాటకానికి తెర తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మించి గొంతు కోయడంలో కేసీఆర్ కుటుంబం ఆరి తేరిందని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. అయితే కేంద్రం ఏ ఒక్క అవినీతిపైనా విచారణకు సిద్దంగా ఉండడం లేదు. కేవలం ఆరోపణలతో కాలం గడిపేస్తోంది. ఇప్పుడు నెపాలను కాంగ్రెస్ మీదకు నెట్టి చోద్యం చూస్తోంది. కేంద్రం కఠినంగా ఉంటే అవినీతి కార్యకలపాలకు ఆసాకరం ఉండేది కాదు.



# కెసిఆర్ పదేళ్ల పాలన తెలంగాణకు శాపం

## రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసిన ఘనుడు - ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



కామారెడ్డి, మే 8 (ప్రజా మంటలు):

కేసీఆర్ అవలంబించిన, అప్పులు చేసిన ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను ఏకం చేస్తామని కాంగ్రెస్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ నుంచి కాంగ్రెస్ అత్యధిక పార్లమెంట్ సీట్లు గెల్చుకుంటుందని అన్నారు. బిఆర్ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదన్నారు. ఆ పార్టీని ప్రజలు మర్చి పోయారని, అవితి వరకే గుర్తు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ ఆదేశాల మేరకు గ్రామాల్లోకి వెళ్లి ప్రతీ ఇంటిని, ప్రతీ పౌరుడుని కదిలిస్తున్నామని ఆయన చెప్పారు. గత పదేళ్ల కేసీఆర్ పాలన దారిద్రపు పాలనని షబ్బీర్ అభివర్ణించారు. తెలంగాణకు కాపలా కుక్కగా ఉంటానన్న కేసీఆర్ అధికారాన్ని అడ్డుపెట్టు కుని దోచుకున్నారని మండిపడ్డారు. ఎంపీ కవిత భర్త పై అనేక వేల కోట్ల అవినీతి ఆరోపణలు ఉన్నాయని మధుయాష్కీ చెప్పారు. కవిత లిక్కర్ కేసుపై ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. కవిత,ఆమె భర్త పేరుపై ఉన్న ఆస్తులు ఎంతని ప్రశ్నించారు. అలాగే కవిత అపార్ట్ మెంట్ నుంచి కోట్ల విలువ చేసే విల్లాలోకి ఎలా మారారని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్ ఇందుకు నిదర్శనమని అన్నారు. ఏ వ్యాపారాలు చేయకుండా ఇన్ని ఆస్తులు ఎలా సంపాదించారో కేసీఆర్ కూతురు కవిత చెప్పాలని డిమాండ్ చేశారు. మియాపూర్ భూ కుంభకోణం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారని, దాని వెనకాల కేసీఆర్ అండ్ ఫ్యామిలీ ఉండొచ్చని మధుయాష్కీ ఆరోపించారు. మతం పేరుతో ప్రధాని మోడీ దేశాన్ని విభజిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు ఔటర్, పేపర్ లీకేజీ అవినీతి కుంభకోణం పై కేసీఆర్ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై కేటీఅర్ ఎందుకు నైతిక బాధ్యత వహించలేదని విమర్శించారు. ఎంతమంది తెలంగాణ యువతకు ఉద్యోగాలు వచ్చాయో కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. అసెంబ్లీ లాగే పార్లమెంటులోనూ కాంగ్రెస్ మవా చాటుతుందన్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేర్చిన కెసిఆర్

ప్రజాసంక్షేమం లక్ష్యంగా సాగిన పాలన

కాంగ్రెస్ పాలనలో తిరోగమన చర్యలు: వేమల



నిజామాబాద్, మే 8 (ప్రజా మంటలు):

రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పునరంకితం అవుతామని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డిఅన్నారు. ఇచ్చిన హామీలన్నీ సీఎం కేసీఆర్ నెరవేర్చారని, అందుకే ప్రజల్లో కెసిఆర్ పట్ల ఆదరణ తగ్గలేదని అన్నారు. ఈ తొమ్మిళ్ళ కాలంలో రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేశామని అన్నారు. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల దరిచేర్చామని ఆయన చెప్పారు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నారని చెప్పారు. పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం ద్వారా 30 ఏళ్ళప్రజల ఆకాంక్షలు నెరవేరాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, మహిళల వికాసమే లక్ష్యంగా పనిచేశామని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ కిట్స్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు మహిళా వికాసానికి దోహదం చేసాయని చెప్పారు. గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించామన్నారు. బీళ్లుగా మారిన వేలాది ఎకరాలను మిషన్ కాకతీయ పంట పొలాలుగా మార్చి సస్యశ్యామలం చేసామని తెలిపారు. తద్వారా తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చామని చెప్పారు. అయితే ఈ పథకాలు ఇప్పుడు పడావు పడ్డాయన్నారు. కాంగ్రెస్ విచారణలు, ఎంక్వైరీలతో కాలక్షేపం చేస్తూ పనులను పక్కన పెట్టిందన్నారు. అందుకు మళ్లీ సాగు,తాగునీటి సమస్యలు ముందరికి వచ్చాన్నారు. అలాగే కరెంట్ కోతలు విపరీతంగా ఉంటున్నాయని అన్నారు. ఇవన్నీ పోవాలంటే బిఆర్ఎస్ బలంగా ఉండాలన్నారు. నిజామాబాద్ ఎంపి అబ్యర్థి బాజిరెడ్డికి ఓటేసి గెలిపించాలన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

## అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

నిజామాబాద్, మే 8 (ప్రజా మంటలు):

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పా టులో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో కల్లాల్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. ఇటీవలి వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధానన్యం వర్షం ధాటికి కొట్టుకు పోయింది. ఇదంతా మార్కెట్ సిబ్బంది నిర్లక్ష్యం జరిగిందే తప్ప మరోటి కాదు. ధాన్యం రాగానే వెంటనే కాటాలు పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో ఉండటం రైతులకు శాపంగా పరిణమించింది. జిల్లాల్లో కోతలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. పంట దిగుబడికి సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో పండిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి నప్పటికీ ఆచరణలో మాత్రం అది అమలు కావడం లేదు. 20 రోజుల క్రితం నుంచే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి కసరత్తు ప్రారంభించిన అధికార యంత్రాంగం ఆచరణలో పెట్టడంలో మాత్రం వెనుకబడి పోయింది. ఫలితంగా ఆరుగాలం శ్రమించి, అధిక వ్యయ ప్రయాసాలకోర్చి సాగు చేసిన వరి పంట మూడు రోజుల క్రితం గాలివాన బీభత్సానికి కకావికలం అయింది. ఇటీవలి కురిసిన అకాల వర్షానికి పంటంతా నీట మునగగా, రైతన్నకు తీరని నష్టం వాటిల్లింది. వర్షం కారణంగా జిల్లాల్లోవందల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పంట కోతకు వచ్చే సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని ఉంటే తమకు అకాల నష్టం జరిగి ఉండేది కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. యాసంగి సీజన్‌లో ముందుగా సాగు చేసిన చోట దాదాపు నెల రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభం కాగా దిగుబడి అంచనాకు సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. తీరా పంట కోసి ఆరబెట్టిన తరువాత అ కాల వర్షం కురిసి ధాన్యం మొత్తం తడిసిపోయింది. కొంత మొత్తం వరదలకు కొట్టుకొని పోయింది. అధికారులు సకాలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి ఉంటే పంటను అమ్ముకొనే వారమని రైతులు వాపోతున్నారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com